RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 153 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం,డిసెంబర్,7,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 153 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday,December,7,2025 | PAGES : 8 RS : 4 /- |




## పెరుగుతున్న చలి తీవ్రత

### పడిపోతున్న ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో క్రమంగా ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి చేరుకుంటున్నాయి. హైదరాబాద్‌లో రాత్రి చలి పెరుగుతోంది. ఉత్తర తెలంగాణ చలిగుప్పిట్లోకి వెళుతున్నది. అటు విశాఖ మన్యంలో కూడా చలి పెరిగింది.వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయి చలి తీవ్రత ప్రజలకు వణుకు పుట్టిస్తుంది.




## ముగిసిన పుతిన్ భారత పర్యటన

### కీలక మలుపు తిప్పిన పుతిన్ రాక

న్యూఢిల్లీ,డిసెంబర్6 : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండురోజుల భారత పర్యటన ముగిసింది. శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన విందుకు హాజరయ్యారు. విందు ముగిసిన తర్వాత అక్కడి నుంచి పుతిన్ నేరుగా విమానాశ్రయానికి చేరుకున్నారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ విమానాశ్రయానికి వెళ్లి వీడ్కోలు పలికారు. 'కలిసి సాగుదాం, కలిసి ఎదుగుదాం'.. అన్న నినాదంతో పుతిన్ తన భారత పర్యటనకు ముగింపు పలకడం విశేషం. గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న పుతిన్‌కు ప్రధాని మోడీ స్వయంగా ఎయిర్‌పోర్టుకు వెళ్లి స్వాగతం పలికిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం పుతిన్‌కు రాష్ట్రపతి ముర్ము అధికారికంగా స్వాగతం పలికారు. భారత్– రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా భారత్ – రష్యా మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. రక్షణ, ఇంధనంసహా అనేక రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్చలు సాగాయి. ఈ పర్యటన సందర్భంగా పుతిన్‌కు ప్రధాని మోడీ వివిధ బహుమతులు అందించారు.



## విమానాల రద్దుపై సుప్రీంలో పిటిషన్

- మానవతా సంక్షోభం నెలకొందని పిల్
- తక్షణమే జోక్యం చేసుకోవాలని కోర్టుకు అభ్యర్థన

న్యూఢిల్లీ,డిసెంబర్6 : ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగోలో నెలకొన్న సంక్షోభంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. గత కొన్ని రోజులుగా 1,000కి పైగా విమానాలను ఇండిగో రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,

ఈ విషయంలో తక్షణమే న్యాయస్థానం జోక్యం చేసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'ఇండిగో ఆల్ ప్యాసింజర్ అండ్ అనదర్' పేరుతో న్యాయవాది నరేంద్ర మిశ్రా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. విమానాల రద్దు, తీవ్ర జాప్యకారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో 'మానవతా సంక్షోభం' తలెత్తిందని పిటిషన్‌లో పేర్కొన్నారు.



## డీకే శివకుమార్‌కు ఈవోడబ్ల్యూ నోటీసులు

### నేషనల్ హెరాల్డ్ కేసులో దర్యాప్తు

న్యూఢిల్లీ,డిసెంబర్6 : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు నేషనల్ హెరాల్డ్ కేసులో మరోసారి ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. కేసులోని కొన్ని ఆర్థిక విషయాలు, లావాదేవీలపై వివరణ ఇవ్వాలని నోటీసులో కోరారు. విచారణకు హాజరు కావాలని కూడా ఆదేశించినట్లు తెలుస్తోంది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో ఈ కేసు చాలాకాలంగా నడుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు విచారణ ఎదుర్కొన్నారు. ఇదే కేసులో భాగంగా గతంలో కూడా డీకే శివకుమార్‌ను ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు ప్రశ్నించాయి. తాజాగా ఆర్థిక నేరాల విభాగంపోలీసులు పంపిననోటీసులతో ఈ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. కేసు విచారణలో భాగంగా కొన్ని కీలకమైన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి డీకే శివకుమార్ నుంచి సమాచారం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ నోటీసులపై శివకుమార్ ఎలా స్పందిస్తారు, విచారణకు ఎప్పుడు హాజరవుతారనేది ఆసక్తికరంగా మారింది. ఈ పరిణామం కర్ణాటక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



## రూ.1000 కోట్లతో ఓయూ అభివృద్ధి

### కార్పొరేట్ వర్సిటీలకు దీటుగా ఉస్మానియా

### అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

### 10న ఓయూను సందర్శించనున్న సీఎం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** చారిత్రక ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) రూపురేఖలను మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. కార్పొరేట్ వర్సిటీలకు దీటుగా, అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో ఓయూను అభివృద్ధి చేసేందుకు రూ.1000 కోట్లకు పైగా వెచ్చించాలని నిర్ణయించింది. ఈ బృహత్ ప్రణాళిక అమలుపై సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం తన నివాసంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రణాళికలో భాగంగా వర్సిటీలో ప్రపంచస్థాయి పరిశోధనా కేంద్రాలు, మెగా హాస్టళ్లు, హైటెక్ అకడమిక్ బ్లాకులు నిర్మించనున్నారు. వీటితో పాటు సైకిల్, వాకింగ్ ట్రాక్‌లు, క్రీడా సదుపాయాలు, హెల్త్ కేర్ సెంటర్, కన్వెన్షన్ హాల్ వంటి ఆధునిక హంగులను కల్పించనున్నారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో విద్యార్థులు, ప్రొఫెసర్ల అభిప్రాయాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇప్పటివరకు సిద్ధం చేసిన డిజైన్ నమూనాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని, వారి సలహాలు స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌తో పాటు డ్రాప్ బాక్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓయూ పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా చిహ్నాలు ఏర్పాటు చేయాలన్నారు. వర్సిటీలోని చారిత్రక, వారసత్వ కట్టడాలను సంరక్షించాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ఓయూ అభివృద్ధికి ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ నెల10న తాను ఓయూను సందర్శిస్తానని రేవంత్ రెడ్డి వెల్లడించారు.



## పుతిన్ గౌరవార్థం రాష్ట్రపతి భవన్ విందు

న్యూఢిల్లీ,డిసెంబర్6 :రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గౌరవార్థం నిన్న రాత్రి రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన విందుకకాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ హాజరుకావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. ఇదే కార్యక్రమానికి లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతలైన రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ఆహ్వానం అందకపోవడం ఈ చర్చకు మరింత ఆజ్యం పోసింది.



## వివాహ వయస్సు రాకున్నా సహజీవనం చేయొచ్చు

### రాజస్థాన్ హైకోర్టు సంచలన తీర్పు

**రాజస్థాన్, డిసెంబర్6 : యువతీయువకుల సహజీవనం విషయంలో రాజస్థాన్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివాహ వయస్సు రాకున్నా సరే యువతీయువకులు మేజర్లయితే పరస్పర ఆమోదంతో సహజీవనం చేయొచ్చని స్పష్టంచేసింది. వివాహ వయస్సు రాలేదన్న కారణం గా రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా హక్కును కాదనలేమని పేర్కొంది. ఈ మేరకు 18 ఏళ్ల యువతి, 19 ఏళ్ల యువకుడి సహజీవనం కేసులో కోర్టు ఈ తీర్పు వెలువరించింది. యువకుడికి వివాహ వయస్సు రాలేదన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనను కోర్టు తోసిపుచ్చింది. యువతి కుటుంబ సభ్యుల నుంచి హాని ఉందన్న యువకుడి ఆందోళన నేపథ్యంలో ఆ జంటకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. రాజస్థాన్ హైకోర్టులో 18 ఏళ్ల యువతి, 19 ఏళ్ల యువకుడు ఓ పిటిషన్ దాఖలు చేశారు.**

**తామిద్దరమూ పరస్పర అంగీకారంతో సహజీవనం చేస్తున్నామని అందులో పేర్కొన్నారు. అయితే, యువతి కుటుంబం దీనిని వ్యతిరేకిస్తూ తమను చంపేస్తామని బెదిరిస్తోందని, తమకు రక్షణ కల్పించాలని యువకుడు కోర్టుకు విజ్ఞప్తి చేశాడు. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆ జంట ఆరోపించింది. ఈ జంటలో యువకుడికి వివాహ వయస్సు (21 ఏళ్లు) రాలేదని, సహజీవనం కొనసాగించేందుకు అనుమతి ఇవ్వకూడదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు విన్నవించారు. అయితే పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనను కోర్టు కొట్టివేసింది. పెళ్లి వయస్సు రాలేదనే కారణంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన స్వేచ్ఛా హక్కును హరించలేమని పేర్కొంది. భారతీయ చట్టాల ప్రకారం సహజీవనాన్ని నిషేధించలేమని.. దీనిని నేరంగా కూడా చూడలేమని జస్టిస్ అనూప్ ధండ్ స్పష్టం చేశారు.**



## తూకంలో తేడాలు

## భగ్గుమంటున్న అన్నదాతలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని చెప్తున్న మరోవైపు అధికారులు ఆచరణలో విఫలమవుతున్నారు. రైతులకు గిట్టుబాటు ధరను అందిస్తామని భరోసా ఇచ్చిన కార్యాచరణ లో మాత్రం అమలు చేయడం లేదు. సకాలం లో రైతుల ధాన్యానికి తూకం జరగకపో వడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యాన్ని ఎండలో ఆరబోసాం.. తూకం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ధాన్యానికి సకాలంలో తూకం జరుగకకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.15 రోజుల నుంచి ధాన్యా న్ని ఆరబోసుకొని కూర్చున్నా ధాన్యానికి తూకం వేయడం లేదు. స్థానిక సింగిల్ విండో అధికారు లు ఏమాత్రం పట్టనట్టు వివరిస్తున్నారు.

# నిజాయితీకి నిలువుటద్దం రంగాచార్యులు





**హైదరాబాద్, డిసెంబర్ 06, (తెలంగాణ దిశ)** :నీతి, నిజాయితీకి నిలువుటద్దం రంగాచార్యులు అని పలువురు వక్తలు కొనియాడారు. మరింగంటి రంగాచార్యులు సంస్మరణ సభ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో సీనియర్ జర్నలిస్ట్ హేమసుందర్ అధ్యక్షతన శనివారం జరిగింది. కార్యక్రమానికి హాజరైన పలువురు మాట్లాడుతూ రంగాచార్యులు గొప్ప స్నేహశీలి అని, పలువురు జర్నలిస్టులకు ఆత్మీయ బంధువని, రంగా చారి లేని లోటు తీర్చలేనిదన్నారు. తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ సంఘంతోను హైదరాబాద్ జర్నలిస్ట్ యూనియన్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ తోను ఎంతో అనుబంధం ఉందని వక్తలు తమ అభిప్రాయం వెలిబుచ్చారు. ఈ సంస్మరణ సభలో సీనియర్ పాత్రికేయులు ఆర్ వి రామారావు, టెక్ మహీంద్ర లా విశ్వవిద్యాలయం డీన్, సీనియర్ పాత్రికేయులు మాడభూషి శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు విరాహత్ అలీ, చిన్న పత్రికల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యూసుప్ బాబు, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శ్రీగిరి విజయ్ కుమార్ రెడ్డి, కార్యదర్శి వరికుప్పల రమేష్, వెటరన్ జర్నలిస్ట్ సంఘం కోశాధికారి ఎన్. శ్రీనివాస రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు రాంలాల్, ఎం. మల్లయ్య, రమణ రావు, వెలిజాల చంద్రశేఖర్, సీతారామ్, బుద్దా మురళి, శ్రీరాంజీ, మూర్తి, అబ్దుల్, అజీజ్ తదితరులు మాట్లాడారు. అదే విధంగా రంగచార్యులు కుటుంబ సభ్యులు కుమార్తె పల్లవి, కుమారుడు వంశీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు బిజెపి మహాధర్నా... మహాధర్నాను విజయవంతం చేయాలి

## - బీజేవైఎం రాష్ట్ర నాయకులు పెద్దర్ల శరత్ చంద్ర చౌదరి



**ఏఎస్ రావునగర్, డిసెంబర్ 06, (తెలంగాణ దిశ)** :ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నగరంలోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర నాయకులు పెద్దర్ల శరత్ చంద్ర పిలుపు నిచ్చారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆచరణకు సాధ్యం కానీ హామీలను ఇచ్చిందని విమర్శించారు. ముఖ్యంగా మహిళలకు నెలకు రూ. 2500, వృద్ధులు, వికలాంగులు వితంతువులకు రూ.4 వేల పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చి మొండి చెయ్యి చూపించిందని విమర్శించారు. రైతులకు ఇస్తానన్న రూ. 15 వేల రైతు భరోసా ఏమయిందని ఆయన ప్రశ్నించారు. అదే విధంగా విద్యార్థులకు విద్యా భరోసా కార్డులు, విద్యార్థినీలకు స్కూటీలు పంపిణీ చేస్తామని నమ్మించి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆయన ధ్వజ మెత్తారు. తక్షణమే పిఆర్ సీ వేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం బిజెపి ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టనున్న మహా ధర్నా కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు.

# పెద్ద వరద నీటి కాలువను ప్రగతి నగర్ డ్రైనేజీలలో కలపద్దు

## - కాంగ్రెస్ నేతలకు ప్రగతి నగర్ వాసుల మొర



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 06, (తెలంగాణ దిశ)** :గండి మైసమ్మ మియాపూర్ ప్రధాన రహదారి నుండి వెళ్లే వరద నీటి కాలువ లైన్ ను ప్రగతి నగర్ లోని చిన్న డ్రైనేజీ లైన్ లో కల్పవద్దని ప్రగతి నగర్ వాసులు కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలను హనుమంత రెడ్డిని అభ్యర్థించారు. 200 ఫీట్ల రోడ్డు అయినా గండిమైసమ్మ బాచుపల్లి రోడ్డు ప్రక్కన వేస్తున్న వరదనీటి కాలువను తీసుకువచ్చి ప్రగతి నగర్ లో ఉన్న చిన్న డ్రైనేజీ లైన్ లలో కలపడం వలన భవిష్యత్తులో చాలా ఇబ్బందులు తలెత్తుతాయని కాలనీ వాసులు కాంగ్రెస్ నేతలకు వివరించారు. దీంతో కొలన్ హనుమంత్ రెడ్డి హెచ్ఎండిఏ అధికారులతో ఈ విషయమై మాట్లాడి పెద్ద పెద్ద వర్షపు నీటి నాలాను తీసు కెళ్లి చిన్న నాలా అయిన ప్రగతి నగర్ డ్రైనేజీలో కలిపితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అధికారులు చేయాలని ఆయన హెచ్ఎండిఏ అధికారులను కోరారు. కొలను హనుమంత్ రెడ్డిని కలిసిన వారిలో ప్రగతి నగర్ కాలనీవాసులు ఆంజనేయ వర్మ, మధుకర్ రెడ్డి, శరత్ రెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ తర్కోల్, విజయ్, రమేష్, అనిల్ తదితరులు ఉన్నారు.

# ఈ నెల 9న కుత్బుల్లాపూర్ సూరారంలో టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా మూడవ మహాసభలు

**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 06 (తెలంగాణ దిశ)** :తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజెఎఫ్) జిల్లా మూడవ మహాసభలను ఈనెల 9వ తేదీన ఉదయం 11 గంటలకు కుత్బుల్లాపూర్ సూరారంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేయడం జరిగిందని ఆహ్వాన కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఇంటి స్థలాలు, జిల్లా కమిటీ ఏర్పాటు, హెల్త్ స్కీమ్, ప్రమాద బీమా, అక్రిడేషన్ కార్డులు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి టీడబ్ల్యూజెఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మామిడి సోమయ్య, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. ఆహ్వాన కమిటీ సభ్యులు ఎంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, యావపురం రవి, కందునూరి నాగరాజుగౌడ్, కట్టెల మల్లేశం, గడ్డమీద అశోక్, గుండబోయిన వేణు తదితరులు మాట్లాడుతూ జిల్లాలోని జర్నలిస్టులందరూ హాజరై జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు.

# రాజ్యాంగ పరిరక్షణ కోసం విద్యార్థి, యువ శక్తి మరింత కట్టుబడి పని చేయాలి



**ఏఎస్ రావునగర్, డిసెంబర్ 06, (తెలంగాణ దిశ)** : బడుగు, బలహీన, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శివానంద్, అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సత్య ప్రసాద్ లు శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎం. శివానంద్ మాట్లాడుతూ సమాజంలో విద్య, సమాన హక్కులు, ఆత్మగౌరవం కోసం అంబేద్కర్ చేసిన పోరాటం యువతకు స్ఫూర్తి అని అన్నారు. రాజ్యాంగం రక్షించుకోవడం అంటే అంబేద్కర్ చూపిన మార్గంలో నడవడం అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి కేవలం ఆర్థిక పురోగతితో కాదని, సామాజిక న్యాయం, సమానత్వం, హక్కులు అందరికీ చేరినప్పుడే సాధ్యం అవుతుందని అంబేద్కర్ బోధించినట్లు గుర్తు చేశారు. యువతరం అంబేద్కర్ విలువలను ఆచరణలో పెట్టి సమాజ మార్పులో ముందుండాలని అన్నారు.సమాన విద్య, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం విద్యార్థి, యువ శక్తి మరింత కట్టుబడి పని చేయాలని పిలుపు నిచ్చారు.

# టీడీపీ నేతల మధ్య సమన్వయం కరువు

**గుంటూరు,తెలంగాణ దిశ** :తెలుగుదేశం పార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం సక్రమంగా పనిచేయడం లేదా? పార్టీ కార్యాలయం వల్లనే పార్టీ ఇన్ని రకాలుగా ఇబ్బందులు పడుతుందా? నేతల మధ్య సమన్వయం లేకపోవడానికి కూడా పార్టీ కేంద్ర పార్టీ కార్యాలయం అనుసరిస్తున్న మెతక వైఖరి అని చెబుతున్నారు. చంద్రబాబు నాయుడు చేతుల్లోకి తెలుగుదేశం పార్టీ వచ్చిన తర్వాత 1995 నుంచి ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ ఏం మాట్లాడాలన్నా అది ముందు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వాల్సి ఉండేది. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ లో ఉన్న ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో మీడియా సమావేశం పెట్టాలన్నా, లేకపోతే అసెంబ్లీ సమావేశాల్లో ఏ విషయాలను అయినా ప్రస్తావించాలన్నా ముందుగా పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించాల్సి వచ్చేది. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో ఉండే... ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో ఉండే లైబ్రరీలో అన్ని అంశాలకు సంబంధించిన విషయాలు.. అసెంబ్లీ చట్టాలకు సంబంధించిన సమగ్ర సమాచారం లభ్యమయ్యేది. నాడు దేవేందర్ గౌడ్ నుంచి కింది స్థాయి నేత వరకూ లైబ్రరీకి వెళ్లే అలవాటు ఉండేది. వారు అసెంబ్లీ సమావేశాల్లోనో, మీడియా సమావేశాల్లోనూ మాట్లాడాలంటే లైబ్రరీకి వెళ్లి తాము మాట్లాడబోయే అంశానికి సంబంధించిన వాటిపై అధ్యయనం చేసేవారు. గతంలో ఉన్న విషయాలను కూడా వారు ఆకళింపు చేసుకునే వారు. అధికారంలో ఉన్నప్పుడైనా, లేకపోయినా సరే ఖచ్చితంగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చి అందుకు సంబంధించిన అంశాలను పరిశీలించేవారు. కానీ రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆ సంప్రదాయానికి నేతలు నీళ్లొదిలేశారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయానికి వారికి కేటాయించే సమయంలో మాత్రమే ఎమ్మెల్యేలు వస్తున్నారు. సబ్జెక్ట్ పై అవగాహన కోసం కానీ, తాము మాట్లాడలనుకున్న విషయాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి తెలియపర్చేందుకు ఇష్టపడటం లేదు. పార్టీ కేంద్ర కార్యాలయం కూడా దీనిని పట్టించుకోవడం లేదు. సీనియర్ నేతలకు మాత్రమే ఈ విషయం తెలుసు. ఇప్పుడంతా కొత్త తరం నాయకులు కావడంతో పార్టీ కేంద్ర కార్యాలయాన్ని అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతోనే సమస్యలు వస్తున్నాయన్న అభిప్రాయం టీడీపీ సీనియర్ నేతల్లో వ్యక్తమవుతుంది. చంద్రబాబు నాయుడు, లోకేశ్ పాలనలో బిజీగా ఉండటంతో పార్టీ కేంద్ర కార్యాలయం చూసుకోవాల్సి ఉన్నా వాటిని పట్టించుకోకపోవడంతో ఈ రకమైన సమస్యలు అసెంబ్లీలో గాని, బయట గాని తలెత్తుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇందుకు సంబధించి బలోపేతం చేస్తే బాగుంటుందన్న సూచనలు వస్తున్నాయి.

# జై జవాన్ కాలనీ సమస్యను పరిష్కరించాలి



**ఏఎస్ రావునగర్, డిసెంబర్ 06, (తెలంగాణ దిశ)** :ఏఎస్ రావునగర్ డివిజన్ జై జవాన్ కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం జిహెచ్ఎంసి కాప్రా ఈఈ నాగేందర్ కు వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో నూతనంగా కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని కాలనీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, ఉపాధ్యక్షులు జిఎస్ఎన్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సలీమ్, సంయుక్త కార్యదర్శి సాహెబ్, న్యాయ సలహాదారుడు యాదగిరి రెడ్డి, కార్యవర్గ సభ్యులు సుందర్, సుభాన్, నాయకులు భద్రగామ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# గ్రంధాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 06, (తెలంగాణ దిశ)** :బాచుపల్లి మండల పరిధిలోని గ్రంథాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని సిపిఐ ఆధ్వర్యంలో బాచుపల్లి మండల తహసీల్దార్ టి.వాణి రెడ్డి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలో దాదాపు రెండున్నర లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. అందులో చదువుకున్న వారే అధికం అన్ని గుర్తు చేశారు. కానీ ఇక్కడ గ్రంధాలయం లేకపోవడం చాలా బాధ కారం అన్ని అన్నారు. కనుక వెంటనే గ్రంధాలయం ఏర్పాటు చేయాలనీ, గతంలో గ్రంధాలయం ఏర్పాటుకు కోసం ఒక రోజు దీక్ష చేశామని, ఒక వేళ వెంటనే గ్రంధాలయం ఏర్పాటు చెకపోయే పెద్ద ఎత్తున నిరసనలు చేస్తాము అన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశి. యాదయ్య, పొన్నికంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ వాణిజ్య ఒప్పందాలు...

అమెరికా, జపాన్ మధ్య వాణిజ్య, విలువైన ఖనిజాల ఒప్పందం కుదిరింది. అధ్యక్షుడు ట్రంప్, జపాన్ ప్రథమ మహిళా ప్రధాని తకాయిచి టోక్యోలో సంతకాలు చేశారు. వివరాలు పూర్తిగా వెల్లడి కాలేదు. అమెరికాలో 550 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ అంగీకరించగా ప్రతిగా దాని వస్తువులపై 15 శాతం దిగుమతి పన్ను విధించేందుకు అమెరికా అంగీకరించింది. ట్రంప్‌కు కావాల్సినన్ని పొగడ్తలు తప్ప అమెరికాకు పెద్దగా ఒరిగిందేమీ లేదని డెమొక్రటిక్ పార్టీ మద్దతుదారైన న్యూయార్క్ టైమ్స్ పత్రిక వ్యాఖ్యానించింది. ఈ ఒప్పందాలను రెండు దేశాల మధ్య సంబంధాలలో ''నూతన స్వర్ణయుగం'' అని వర్ణించారు. అదిరింపులు బెదిరింపుల మధ్య జులై లోనే పెట్టుబడులు, పన్నుల గురించి ఒక అవగాహన కుదిరినట్లు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు. అయితే నాడు సంతకాలు జరగటానికి ముందు చివరి క్షణం వరకు అనేక అనుమానాలు షికారు చేశాయి. పశ్చిమాసియాలో శాంతి, థారులాండ్– కంపూచియా మధ్య వివాదాన్ని పరిష్కరించటంలో ట్రంప్ పాత్రను తకాయిచి ఆకాశానికి ఎత్తారు. వారి చర్చల తరువాతే టోక్యోలోని అక్సాకా పాలెస్‌లో జరిగిన స్వాగత కార్యక్రమానికి ట్రంప్ హాజరయ్యాడు. ఈ ఒప్పందం గురించి ప్రశంసలు, విమర్శలు గతంలోనే వెల్లడయ్యాయి.

జపాన్ నుంచి అమెరికా ఇప్పటి వరకు లక్ష కోట్ల డాలర్ల మేర రుణాలుగా తీసుకుంది. అమెరికా డాలర్ల కోసం ప్రతి దేశాన్నీ బెదిరిస్తున్నది. అయితే తాజాగా కుదిరిన ఒప్పందం గురించి గతంలోనే ట్రంప్ మీద విమర్శలు వచ్చాయి. ఆ ఒప్పందంలో తరువాత ఎలాంటి మార్పులూ చేసినట్లు ఎవరూ ప్రకటించలేదు గనుక గత విమర్శలేమిటో ఒకసారి చూద్దాం. ఐదు వందల యాభై బిలియన్ డాలర్ల మొత్తాన్ని ప్రభుత్వానికి ఇస్తే తమ ఇష్టం వచ్చినట్లు వినియోగించుకుంటామని, దాని మీద వచ్చే లాభాలలో 90 శాతం తమకే అని ట్రంప్ వత్తిడి చేశాడు. అయితే ఆ మొత్తంలో కేవలం రెండు శాతం మాత్రమే పెట్టుబడిగా ఉంటుందని, మిగిలిన మొత్తం రుణాలు, రుణ హామీల వంటి ఇతర రూపాల్లో ఉంటుందని జపాన్ వర్గనేత రోయెసీ అకజావా టీవీలో బహిరంగంగా చెప్పాడు. కొంత మంది అమెరికన్లకు జపాన్‌ను విక్రయించారని విమర్శిస్తున్నారని, లాభాల్లో 90 శాతానికి అంగీకరించినందున నష్టం పెద్దగా ఉండదని, దీనికి ప్రతిగా అమెరికా తగ్గించే పన్నుల వలన 68 బిలియన్ డాలర్ల మేర జపాన్‌కు లబ్ధి కలుగుతుందని కూడా చెప్పాడు. బహుశా ఈ కారణంతోనే నాడు ఒప్పందంపై సంతకాల తరువాత న్యూయార్క్ టైమ్స్ పత్రిక ప్రతికూలంగా వ్యాఖ్యానించిందని చెప్పవచ్చు. తమ దేశంలో పెట్టుబడులకు, పన్నులు విధింపుకు లంకె పెట్టటం ఒక్క జపాన్ విషయంలోనే కాదు. ఇప్పటికే ఐరోపా యూనియన్‌తో 600 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడితేనే 15 శాతం పన్నులు విధిస్తామని లేకుంటే ఎక్కువ అని ట్రంప్ బెదిరించాడు. వాణిజ్యం చేయటం, లాభాలు పిండుకోవటంలో అమెరికా, జపాన్ ఎవరికి ఎవరూ తీసిపోరు గనుక పరస్పర లబ్ధి లేకుండా అంగీకరించే అవకాశం ఉండదని చెప్పవచ్చు. ముందే చెప్పుకున్నట్లు ఒక లక్ష కోట్ల డాలర్లు అమెరికాకు అప్పు ఇవ్వటమేగాక మరో రెండు లక్షల కోట్ల డాలర్ల మేర ఇప్పటికే జపాన్ పెట్టుబడులు పెట్టింది. ఈ విషయంలో బ్రిటన్ రెండవ స్థానంలో ఉంటే చైనా మూడవదిగా ఉంది. అమెరికాలో ఉన్న జపాన్ కంపెనీలైన సోనీ, టొయోటా వంటి బహుళజాతి కంపెనీలు, ద్రవ్య పెట్టుబడి సంస్థలు అక్కడ పెట్టుబడులు పెట్టి లాభాలు సంపాదిస్తున్నాయి, వచ్చిన లాభాలను తిరిగి అక్కడే పెట్టుబడులుగా పెడుతున్నాయి. తాజా ఒప్పందంలో అమెరికా కార్లకు ద్వారాలు తెరిచేందుకు జపాన్ అంగీకరించినట్లు చెబుతున్నారు.

# సంపాదకీయం

## పాపం చిన్నారులు

చూస్తూ చూస్తూ విషాన్ని ఎవరూ తాగరు. ఎదుటివారు తాగాలని కూడా కోరుకోరు. కానీ మన ప్రభుత్వాలు అలా చూస్తూ ఇక ఉండిపోయాయి. సిరప్ రూపంలో ఉన్న విషం తాగుతుంటే నిశ్శబ్దాన్ని నటించాయి. ఫలితంగా చాలా మంది పిల్లల ప్రాణాలు గాలిలోఏ కలిసిపోయాయి. ఈ వ్యవహారంలో ప్రభుత్వానిది సింహభాగం తప్పుంటే.. తయారుచేసిన కంపెనీ, రాసిన వైద్యులు ఈ దారుణంలో పాలుపంచుకున్నారు ప్రస్తామన దేశ వ్యాప్తంగా ఇప్పుడు కోల్డ్ రిఫ్ కాఫ్ సిరప్ గురించి విపరీతమైన చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఈ సిరప్ తాగి మన దేశ వ్యాప్తంగా 15 మంది చిన్నారులు బలయ్యారు. వీరంతా కూడా ఐదు సంవత్సరాలలోపు వారే. కోల్డ్ రిఫ్ కాఫ్ సిరప్ లో ప్రమాదకరమైన రసాయనాలు ఉన్నాయి. వాస్తవానికి దగ్గు మందులు రసాయనాలు కలపడం నిషేధం. కానీ ఆ కంపెనీ ఆ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కింది. అంతేకాదు అడ్డగోలుగా కోల్డ్ రిఫ్ కాఫ్ సిరప్ లు విక్రయించింది. వైద్యులకు తాయిలాలు ఎర వేసి కోల్డ్ రిఫ్ కాఫ్ సిరప్ ను పిల్లలు తాగేలా చేసింది.మొదట్లో కోల్డ్ రిఫ్ కాఫ్ సిరప్ తాగిన పిల్లలు బాగానే ఉన్నారు. ఆ తర్వాత అందులో ఉన్న రసాయనాలు వారి శరీరాల మీద ప్రభావం చూపించడం మొదలుపెట్టాయి. దగ్గు తగ్గడం మాట అటు వంచితే.. చివరికి వారి ప్రాణాలు పోయాయి. 2022లో మన దేశం నుంచి కోల్డ్ రిఫ్ కాఫ్ సిరప్ గాంబియా దేశానికి ఎగుమతి అయ్యాయి. అక్కడ దాదాపు డజన్ మంది పిల్లలు చనిపోయారు. అయినప్పటికీ ఆ దారుణం నుంచి మన దేశం పాఠాలు నేర్చుకోలేదు. దీనికి తోడు ఔషధాల తయారీలో వ్యవస్థాపరమైన లోపాలు ప్రజల ప్రాణాలను ఎలా తీస్తున్నాయో ఈ ఉదంతం బయటపెట్టింది. దీనిపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ నిర్వహించాలని సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలైంది.కోల్డ్ రిఫ్ కాఫ్ సిరప్ విషయంలో అడుగడుగున ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తోంది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ కంపెనీకి విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చింది. అధికారులు కూడా తనిఖీలు నిర్వహించడం విఫలమయ్యారు. కోల్డ్ రిఫ్ కాఫ్ సిరప్ ను తమిళనాడు రాష్ట్రానికి చెందిన శ్రీ సన్ అనే కంపెనీ తయారు చేసింది. ఈ కంపెనీ నిబంధనలు పాటించకపోగా.. ప్రమాదకర రసాయనాలను కలిపింది. వీటివల్ల చిన్నారుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ రసాయనాల వల్ల చిన్నారులు మెల్లిమెల్లిగా మరణానికి దగ్గరయ్యారు. పిల్లల ప్రాణాలు పోవడంలో అధికారులు, ప్రభుత్వం, శ్రీ సన్, వైద్యులు అందరూ భాగస్వాములేనని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఆ కంపెనీ పై చర్యలు తీసుకొని.. చనిపోయిన పిల్లల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయికలుషితమైన కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ కారణంగా సుమారు 20 మంది పిల్లలు మరణించిన తరువాత డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. ఔషధ ఉత్పత్తుల కోసం కఠినమైన పరీక్షా ప్రోటోకాల్‌లను అమలు చేయాలని సూచించింది. ముడి పదార్థాలు, తుది ఉత్పత్తులు రెండింటినీ క్షుణ్ణంగా బ్యాచ్ పరీక్ష చేయడం, డ్రగ్స్ నిబంధనల ప్రకారం భద్రతా నిబంధనలకు కట్టుబడి ఉండటం, ఆమోదించబడిన విక్రేతల నుండి ప్రత్యేకంగా పదార్థాలను సోర్సింగ్ చేయడం అత్యవసరమని రెగ్యులేటర్ పేర్కొంది.చింద్వారా జిల్లాలో బాధిత పిల్లలు తీసుకున్న కోల్డ్రిఫ్ సిరప్‌లో ప్రమాదకరమైన స్థాయిలో డైథిలిన్ గ్లైకాల్ ఉందని, దాదాపు 500 రెట్లు ఎక్కువగా ఉందని దర్యాప్తులో తేలింది. మూత్రపిండాల వైఫల్యానికి కారణమయ్యే ఈ విషం కనీసం ఆరుగురు పిల్లలను తీవ్ర అనారోగ్యానికి గురిచేసింది. నాలుగు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఇవ్వడానికి అనుమతి లేనప్పటికీ, సిరప్ పెద్ద స్థాయిలో విక్రయించారు.పిల్లల మరణాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇద్దరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను, ఒక డిప్యూటీ డైరెక్టర్‌ను సస్పెండ్ చేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియోగంతో రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్‌ను బదిలీ చేసింది. ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేశారు. తమిళనాడుకు చెందిన దగ్గు సిరప్ తయారీదారుపై కేసు నమోదు చేశారు. అదనంగా చింద్వారా పిల్లల వైద్యుడు డాక్టర్ ప్రవీణ్ సోని అరెస్టు చేయబడ్డాడు, అతని కుటుంబ క్లినిక్‌ను సీల్ చేశారు. అయితే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అతన్ని సమర్థించింది, మూల కారణం ఔషధ కంపెనీ లోపాలు, ఔషధ పర్యవేక్షణలో వ్యవస్థాగత బలహీనతలు అని పేర్కొంది.డ్రగ్స్ రూల్స్‌లోని 74(ఇ), 78(ఇ)(తితి) నిబంధన లను ప్రస్తావిస్తూ.. తనిఖీ సమయంలో ప్రతి బ్యాచ్ ఔషధాన్ని పర్యవేక్షించడం, తయారీదారులు వివరణాత్మక పరీక్ష రికార్డుల ను నిర్వహించేలా చూసుకోవడం రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్‌ల బాధ్యత అని డైరెక్టరేట్ గుర్తు చేసింది. విడుదల ముందు పరీక్ష లేకుండా ఏ బ్యాచ్ మార్కెట్‌లోకి ప్రవేశించకుండా చూసుకోవాలి అని కమ్యూనికేషన్ పేర్కొంది, మెటీరియల్ సమగ్రతను నిర్ధారించడానికి కొనసాగుతున్న తనిఖీలు, విక్రేత ధృవీకరణ అవసరమని తెలిపింది.

# అంబేద్కర్ ఆలోచనలే భారత ప్రజాస్వామ్యానికి పునాది

## కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్





**ఏఎస్ రావునగర్,డిసెంబర్ 06, (తెలంగాణ దిశ):** అంబేద్కర్ ఆలోచనలే భారత ప్రజాస్వామ్యానికి పునాదని కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్ అన్నారు. శనివారం డాక్టర్ బిఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సమాజ సమానత్వం కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ జీవితమంతా సమానత్వం, న్యాయం,మానవ హక్కుల కోసం మహా ఉద్యమం కొనసాగించారని అన్నారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ, ఎప్పుడూ న్యాయం కోసం వెనుకడుగు వేయలేదన్నారు. రాజ్యాంగంలో ప్రతి పౌరునికి సమాన హక్కులు, స్వేచ్ఛ, అస్పృశ్యత రద్దు వంటి మహత్తరమైన విలువలు అంబేద్కర్ కృషి వల్లే సాధ్యమైందన్నారు. విద్యే మహా ఆయుధమని, విద్య లేకుండా విముక్తి లేదని అంబేద్కర్ చెప్పిన మాటలు ప్రతి ఒక్కరికి మార్గదర్శకమని అన్నారు. యువతలో విద్య, అవగాహన, సామాజిక బాధ్యత పెంచడం మనందరి కర్తవ్యమన్నారు. కేవలం రాజకీయ స్వేచ్ఛతో కాదు, ఆర్థికంగా బలపడకపోతే దేశం ముందుకు పోదని అంబేద్కర్ స్పష్టం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉద్యోగావకాశాలు, పరిశ్రమలు, చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం అవసరమని అన్నారు . భారతీయ మహిళలకు ఆస్తి హక్కుతో పాటు సమాన హక్కులు ఇచ్చేందుకు అంబేద్కర్ ముందుండి పోరాడారని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించినట్లు మహిళల ఆర్థిక అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధి అనే మూడు సూత్రాలపై అంబేద్కర్ చూపిన దారిలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అంబేద్కర్ జీవితాన్ని ప్రతిరోజూ ప్రేరణగా తీసుకోవాలన్నారు. కష్టపడి చదవడం, న్యాయం కోసం మాట్లాడటం, సమాజానికి సేవ చేయడం యువత కర్తవ్యమన్నారు. కులం, మతం, భాష అనే భేదాలన్నీ పక్కనబెట్టి మనం భారతీయులుగా ఒకటిగా నిలవడం అంబేద్కర్ కల అని అన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయటమే కాదని, ఆయన ఆలోచనలను మన హృదయాల్లో పెట్టుకోవడమే నిజమైన నివాళి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాకాల రాజు, భూపాల్ రెడ్డి, పెద్ది నాగరాజు, తల్లపల్లి మేగరాజు, ఓబీసీ స్టేట్ కన్వీనర్ మేదరి రామలింగం, అల్లూరయ్య, ముదిగొండ లింగస్వామి, జిఏ చౌదరి గారు భద్ర గ్రామ నరసింహ తల్లపల్లి సందీప్ గౌడ్, మామిడి శ్రీనివాస్ సిహెచ్ బాల నరసింహ సాహెబ్, ఉపేందర్ రెడ్డి, శ్రీనాథ్, యాదగిరి రెడ్డి, సలీం, జిఎస్ఎన్ రావు, రెహమతుల్లా సుభాన్, పీరా ఎస్ కె. వలి, అల్లా బక్షి, భవాని, మాధవి, సునీత, రాణి, పద్మ, విజయలక్ష్మి, రాజు, విల్సన్, పి. సత్యనారాయణ, షేక్ జైని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల హక్కుల కోసం పోరాడిన మహనీయులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్

## మహిళా కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షురాలు తాటికాయల కోమలత





**గుండ్ల పోచంపల్లి,డిసెంబర్ 06, (తెలంగాణ దిశ) :**మహిళల హక్కుకోసం పోరాడిన మహనీయులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని మహిళా కాంగ్రెస్ మేడ్చల్ ఏబ్లాక్ అధ్యక్షురాలు తాటికాయల కోమలత అన్నారు. శనివారం గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని బాసురేగడిలోని ఏడవ వార్డు పరిధిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాటికాయల కోమలత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజ సమానత్వం కోసం అంబేద్కర్ ఎంతో పోరాటం చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ జీవితమంతా సమానత్వం, న్యాయం, మానవ హక్కుల కోసం మహా ఉద్యమం కొనసాగించారని అన్నారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ, ఎప్పుడూ న్యాయం కోసం వెనుకడుగు వేయలేదన్నారు. రాజ్యాంగంలో ప్రతి పౌరునికి సమాన హక్కులు, స్వేచ్ఛ, అస్పృశ్యత రద్దు వంటి మహత్తరమైన విలువలు అంబేద్కర్ కృషి వల్లే సాధ్యమయ్యాయని అన్నారు. విద్యే మహా ఆయుధమని, విద్య లేకుండా విముక్తి లేదని అంబేద్కర్ చెప్పిన మాటలు ప్రతి ఒక్కరికి మార్గదర్శకమని అన్నారు. యువతలో విద్య, అవగాహన, సామాజిక బాధ్యత పెంచడం మనందరి కర్తవ్యమన్నారు. కేవలం రాజకీయ స్వేచ్ఛతో కాదని, ఆర్థికంగా బలపడకపోతే దేశం ముందుకు పోదని అంబేద్కర్ స్పష్టం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉద్యోగావకాశాలు, పరిశ్రమలు, చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం అవసరమని అన్నారు . భారతీయ మహిళలకు ఆస్తి హక్కుతో పాటు సమాన హక్కులు ఇచ్చేందుకు అంబేద్కర్ ముందుండి పోరాడారని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించినట్లు మహిళల ఆర్థిక అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధి అనే మూడు సూత్రాలపై అంబేద్కర్ చూపిన దారిలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అంబేద్కర్ జీవితాన్ని ప్రతి రోజూ ప్రేరణగా తీసుకోవాలన్నారు. కష్టపడి చదవడం, న్యాయం కోసం మాట్లాడటం, సమాజానికి సేవ చేయడం యువత కర్తవ్యమన్నారు. కులం, మతం, భాష అనే భేదాలను పక్కనబెట్టి మనం భారతీయులుగా ఒకటిగా నిలవడం అంబేద్కర్ కల అని అన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయటమే కాదని, ఆయన ఆలోచనలను మన హృదయాల్లో పెట్టుకోవడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ గుండ్ల పోచంపల్లి మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ టి. శిల్ప,కాంగ్రెస్ నాయకులు రామస్వామి, మల్లయ్య, అబ్రార్, తరుణ్, సునీల్, సురేష్, ప్రవీణ్, వినయ్, రాజు, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా టీటీడీపీ ప్లాన్..!



హైదరాబాద్,: ఉమ్మడి ఏపీలో తెలుగుదేశం పార్టీకి ఘనమైన చరిత్ర ఉంది. పార్టీ ఏర్పాటు చేసిన తొమ్మిది నెలల కాలంలోనే అధికారంలోకి వచ్చింది. ఎన్నో సంక్షోభాలను దాటుకొని ప్రధాన పార్టీగా నాలుగు దశాబ్దాల పాటు తన ఉనికి చాటుకుంటూ వస్తోంది. కానీ తెలంగాణలో ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. కనీసం ఆ పార్టీ విభాగానికి తెలంగాణ నుంచి అధ్యక్షుడు లేకపోవడం గమనార్హం. చివరిగా కాసాని జ్ఞానేశ్వర్ 2023 ఎన్నికల వరకు తెలంగాణ టిడిపి అధ్యక్షుడిగా ఉండేవారు. కానీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి పోటీ చేయడానికి నిరాకరించడంతో ఆయన తన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. అది మొదలు ఎంతవరకు అధ్యక్ష పదవి భర్తీ చేయలేదు. ఇది నిజంగా తెలుగుదేశం పార్టీకి పెద్ద లోటు తెలంగాణలో.. తాజాగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. సెటిలర్స్ ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తప్పకుండా పోటీ చేయాలని తెలంగాణ నేతలు కోరారు. కానీ పార్టీ అధినేత చంద్రబాబు నో చెప్పారు.తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి చాలా చరిత్ర ఉంది. బలమైన ఓటు బ్యాంకు దాని సొంతం. కానీ కెసిఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు తర్వాత తెలుగుదేశం పార్టీకి తెలం గాణలో దెబ్బ తగులుతూ వస్తోంది. 2014 వరకు గణనీయమైన పాత్ర పోషించిన తెలుగుదేశం పార్టీ ఊపిరిని తీయడం ప్రారంభిం చారు కెసిఆర్. తెలుగుదేశం పార్టీని దెబ్బ కొట్టి.. తన టిఆర్ఎస్ను బలోపేతం చేసి.. రెండుసార్లు అధికారంలోకి వచ్చారు. కానీ ఇప్పుడు కెసిఆర్ ఓడిపోయారు. అయినా సరే తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు టిడిపి నాయకత్వం ఇష్టపడడం లేదు. దానికి కారణాలు కూడా తెలియడం లేదు.తాజాగా జూబ్లీహిల్స్ (ఉప ఎన్నికలు నేపథ్యంలో తెలంగాణ టిడిపి నేతలు చంద్రబాబును కలిశారు. పోటీ చేద్దామన్న ప్రతిపాదన పెట్టారు.

# రాగులతో లడ్డూలను ఇలా తయారు చేసి తినండి..



ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరగడంతో ఇప్పుడు చాలా మంది చిరు ధాన్యాలను తినడం ప్రారంభించారు. కానీ ఒకప్పుడు మన పూర్వీకులు వీటినే ప్రధాన ఆహారంగా తినేవారు. అందుకనే వారు అన్ని ఏళ్ల పాటు ఆరోగ్యంగా బతికేవారు. వృద్ధాప్యంలోనూ ఎలాంటి వ్యాధులు వచ్చేవి కావు. శారీరకంగా చాలా దృఢంగా, యాక్టివ్‌గా ఉండేవారు. అయితే చిరు ధాన్యాల్లో రాగులు ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఇవి అందరికీ అందుబాటులో ఉంటాయి. రాగులతో అనేక రకాల వంటకాలను తయారు చేయవచ్చు. మన దేశంలో ఎంతో పూర్వ కాలం నుంచే రాగులను తింటున్నారు. రాగులతో పిండి తయారు చేసి దాంతో పలు వంటకాలను వండుతుంటారు. ఈ క్రమంలోనే రాగులకు చెందిన వంటకాల్లో రాగి లడ్డూలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. వీటిని రోజుకు ఒకటి తింటే చాలు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

ఎముకల దృఢత్వానికి..: రాగుల్లో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. వయస్సు మీద పడిన తరువాత ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా చూస్తుంది. ముఖ్యంగా చిన్నారులకు రాగులు ఎంతో మేలు చేస్తాయి. వారిలో ఎదుగుదల సరిగ్గా ఉంటుంది. పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చు. రాగుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తుంది. దీని వల్ల మలబద్ధకం సైతం తగ్గుతుంది. కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధిక బరువు

## రోజూ ఒకటి తింటే ఎన్నో లాభాలు..!

తగ్గాలనుకుంటున్న వారు రాగులను రోజూ ఏదో ఒక రూపంలో తింటే మేలు జరుగుతుంది. రాగులను లడ్డూల రూపంలో రోజూ తినడం చాలా సులభమైన పద్ధతిగా చెప్పవచ్చు.

రక్తహీనతకు..: రాగులు డయాబెటిస్ ఉన్నవారికి కూడా ఎంతో మేలు చేస్తాయి. వీటి గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే రక్తంలో షుగర్ లెవల్స్ వెంటనే పెరగవు. పైగా వీటిల్లో ఉండే ఫైబర్ వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. అందువల్ల డయాబెటిస్ ఉన్నవారు సైతం రాగులను తినవచ్చు. అయితే డయాబెటిస్ ఉన్నవారు రాగి లడ్డూలను తినాలనుకుంటే వాటిని బెల్లంతో తయారు చేసి తింటే మంచిది. లేదంటే ప్రయోజనాలు లభించవు. ఇక రాగుల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయం చేస్తుంది. అందువల్ల రాగి లడ్డూలను తింటుంటే రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. రాగులను ఆహారంలో భాగం చేసుకుంటే కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

ఇలా తయారు చేయండి..: రాగి పిండితో ఇతర వంటకాలను చేయడం రోజూ కష్టంతో కూడుకున్న పని. కానీ లడ్డూలను ఒకసారి చేసి పెట్టుకుంటే రోజూ ఒకటి చొప్పున తినవచ్చు. దీంతో రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం పొందవచ్చు. రాగి లడ్డూలను తయారు చేసేందుకు గాను రాగి పిండిని తీసుకుని ముందుగా దాన్ని పెనంపై వేయించాలి. తరువాత అందులో యాలకుల పొడి కలిపి పెట్టుకోవాలి. అనంతరం బెల్లం పాకం పట్టి ముందు సిద్ధం చేసుకున్న రాగి పిండిలో వేసి కలపాలి. అందులోనే కాస్త నెయ్యిని మరిగించి కలపాలి. ఈ పిండిని లడ్డూల్లా తయారు చేసి నిల్వ చేయాలి. ఈ లడ్డూలను రోజుకు ఒకటి చొప్పున తినవచ్చు. అయితే బాదంపప్పు, ఖర్జూరాలు, గుమ్మడికాయ విత్తనాలు వంటి డ్రై ఫ్రూట్స్‌ను కూడా ఈ లడ్డూల్లో కలపవచ్చు. దీంతో మరిన్ని పోషకాలు లభిస్తాయి. ఇంకా ఎక్కువ లాభాలు కలుగుతాయి. ఇలా రాగి లడ్డూలను తయారు చేసి తింటే ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు.



## దేశంలోనే బిగ్ ల్యాండ్ డీల్.. అక్కడ ఎకరాకు రూ. 752.71 కోట్లు!

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) భారీ మొత్తం వెచ్చించి భూమి కొనుగోలు చేయడం ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగంలో చర్చనీయాంశమైంది. సౌత్ ముంబైలోని నారీమన్ ప్రాంతంలో మెట్రో రైల్ కార్పొరేషన్‌కు చెందిన 4.61 ఎకరాల భూమిని ఆర్‌బీఐ రూ. 3,472 కోట్ల రికార్డు ధరకు కొన్నది. అంటే ఆర్‌బీఐ ఒక్కో ఎకరాకు రూ. 752.71 కోట్లు ఖర్చు చేసింది. ఇది దేశంలోనే అతిపెద్ద భూ ఒప్పందాలలో ఒకటిగా నిలిచిందని రియల్ ఎస్టేట్ వర్గాలు తెలిపాయి. 1970ల ప్రారంభంలో ప్రధాన ప్రణాళికాబద్ధమైన వాణిజ్య జోన్‌గా ఆవిర్భవించిన తర్వాత నారిమన్ పాయింట్‌లోని ఒక భూమిని వేలం వేయడం ఇదే మొదటిసారి.

స్టాంప్ డ్యూటీ రూ. 208.3 కోట్లు: రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్స్ సంస్థ సీఆర్‌ఈ మ్యాట్రిక్స్ యాక్సెస్ చేసిన డాక్యుమెంట్ల ప్రకారం.. సెప్టెంబర్ 5న ఈ లావాదేవీ కోసం ఆర్‌బీఐ రూ. 208.3 కోట్ల స్టాంప్ డ్యూటీ చెల్లించింది. ఈ స్థలాన్ని సొంత కార్యాలయ వినియోగంతో పాటు వాణిజ్య ప్రయోజనాల కోసం కొనుగోలు చేసినట్టు ఆర్‌బీఐ పేర్కొన్నది. బాంబే హైకోర్టు, ఇతర కార్పొరేట్ హెడ్‌క్వార్టర్లకు దగ్గరలో ఉన్న ఈ స్థలాన్ని మొదట వేలం వేయాలని మెట్రో రైల్ భావించింది. కానీ ఆర్‌బీఐ తన హెడ్‌క్వార్టర్స్‌ను విస్తరించాలని భావించడం,

ఈ స్థలంపై ఆసక్తి చూపడంతో ఆర్‌బీఐ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్న ముంబై మెట్రో వేలానికి సంబంధించిన టెండర్ రద్దయింది. ప్రస్తుతం ఆర్‌బీఐ ప్రధాన కార్యాలయం దక్షిణ ముంబైలోని ఫోర్ట్‌లో ఉంది. తాజా భూమి కొనుగోలు ద్వారా ముంబై రియల్ ఎస్టేట్ రంగంలో ఆర్‌బీఐ తన ఆస్తులను మరింత విస్తరించింది. ఇప్పటికే మింట్ రోడ్, మరికొన్ని చోట్ల సెంట్రల్ బ్యాంకుకు స్థిరాస్తులు ఉన్నాయి. ఆర్‌బీఐ తాజా కొనుగోలు ఇప్పటివరకు అత్యధికం కాగా, గతంలోనూ దాదాపు ఇంతే మొత్తం భూమి కొనుగోలు జరిగింది. 2019, జూన్‌లో ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహించిన వేలంలో సుమిటొమో కార్పొరేషన్ బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో(బీకేసీ)లో 3 ఎకరాల కోసం రూ. 2,238 కోట్లకు బిడ్ వేసింది.


# మాటిమాటికీ మౌత్ వాష్?!



దంత సంరక్షణ కోసం రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని వైద్యులు చెబుతుంటారు. కానీ, సమయాభావం వల్ల చాలామంది ఒక్కసారే కానిచ్చేస్తుంటారు. మరికొందరు రాత్రిపూట 'మౌత్ వాష్'ను ఆశ్రయిస్తుంటారు. అయితే, ఇలా ప్రతిరోజూ మౌత్ వాష్‌తో నోటిని శుభ్రం చేసుకోవడం మంచిదికాదని డెంటిస్టులు హెచ్చరిస్తున్నారు. మౌత్ వాష్ అనేది రెగ్యులర్‌గా వాడాల్సిన ఉత్పత్తి కాదని డెంటిస్టులు చెబుతున్నారు. నోటిలో, దంతాలలో ఏదైనా సమస్య ఉన్నప్పుడు మాత్రమే దీనిని వాడాలని సూచిస్తున్నారు. చాలా రకాల మౌత్ వాష్‌లు ఆల్కహాల్‌తో తయారవుతాయి. అది నోటిలో లాలాజల ఉత్పత్తిని తగ్గిస్తుంది. రెగ్యులర్‌గా వాడితే నోరు పొడిబారుతుంది. లాలాజల ఉత్పత్తి తగ్గడం వల్ల నోటిలో బ్యాక్టీరియా అధికంగా పెరుగుతుంది. మరికొన్ని రకాల మౌత్‌వాష్‌లలో 'క్లోరెక్సిడైన్' అనే మందును వాడుతారు. ఇది నోటిలోని బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వైరస్‌లను చంపుతుంది. దీర్ఘకాలంలో దంతాలపై మరకలను ఏర్పరుస్తుంది. మౌత్‌వాష్‌ను రోజూ ఉపయోగిస్తే.. నోటిలో ఉండే మంచి బ్యాక్టీరియా కూడా నశిస్తుంది. మౌత్‌వాష్‌లోని రసాయనాలు.. చాలాసేపటి వరకు నోటినే అంటిపెట్టుకొని ఉంటాయి. తినే ఆహారపు రుచిని ప్రభావితం చేస్తాయి. ఆల్కహాల్ ఎక్కువగా ఉండే మౌత్‌వాష్‌లను రెగ్యులర్‌గా వాడితే.. దంతక్షయం వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

ఎప్పుడు వాడాలి?: మౌత్ వాష్ ఒక సహాయక ఉత్పత్తి మాత్రమే! బ్రషింగ్, ఫాగింగ్‌కు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదు. నోటి అనారోగ్యం, చిగుళ్ల వాపు, నోటి దుర్వాసన, అధిక క్యావిటీల్లాంటి సమస్యలు ఉన్నపుడే మౌత్ వాష్‌ను వాడాలి. అదికూడా వైద్యుల సిఫారసు మేరకే! అందులోనూ ఆల్కహాల్ లేని మౌత్ వాష్ వాడటం బెటర్. కేవలం 20 - 30 సెకన్ల పాటు మాత్రమే దీనిని వాడాలి. చిన్న పిల్లలు మౌత్ వాష్ వాడటం మంచిదికాదు.

# ఉద్యోగులూ.. పారాహుషార్!



కూర్చొని పనిచేసే ఉద్యోగుల్లో బద్ధకం పెరిగిపోతుంటుంది. హుషారు తగ్గిపోతుంటుంది. ముఖ్యంగా మెట్రో నగరాల్లోని డెస్క్ ఉద్యోగుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఇలాంటి ఉద్యోగాలు చేస్తున్నా రోజుకు కనీసం 30 నిమిషాలైనా వ్యాయామం చేయడానికి వారికి కుదరడం లేదని తాజా అధ్యయనం ఒకటి పేర్కొన్నది. ఫలితంగా వారిలో హృద్రోగ సమస్యలు 40 శాతం పెరిగినట్లు తేలింది. ఈ క్రమంలో ఉద్యోగులు కాస్త హుషారు పెంచుకోవాల్సిన అవసరం ఉన్నదని సర్వేకారులు చెబుతున్నారు. రోజంతా కూర్చొనే ఉండటం, తక్కువ శారీరక శ్రమ.. ఉద్యోగుల్లో గుండె సమస్యలను పెంచుతున్నది. ఏఐ ఆధారిత హెల్త్‌కేర్ సంస్థ 'ఎకిన్‌కేర్' ఇటీవల 'ది ఇండియా ఇంక్ హార్ట్ ఇండెక్స్ : రిస్క్ అండ్ యాక్షన్' పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది. ఇందులో డెస్క్ ఉద్యోగాలు చేస్తున్నవారి ఆరోగ్యం గురించి పలు ఆందోళనకర విషయాలను బయటపెట్టింది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో పనిచేస్తున్న వారిలో 40 శాతం గుండె జబ్బుల కేసులు పెరిగినట్లు వెల్లడించింది. శారీరక శ్రమ లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని గుర్తించింది. దాదాపు 65 శాతం మంది ఉద్యోగులు రోజుకు కనీసం 30 నిమిషాల కంటే తక్కువ సమయం వర్కవుట్లు చేస్తున్నట్లు పేర్కొన్నది. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తేనే.. హృద్రోగ సమస్యలను తగ్గించొచ్చని చెప్పుకొచ్చింది. రోజుకు 30 నిమిషాల నడక, స్ట్రెచింగ్ లాంటి తేలికపాటి వ్యాయామాలు చేయాలని అధ్యయనకారులు సూచిస్తున్నారు. లేకుంటే, బరువుతోపాటు రక్తపోటు కూడా పెరిగి.. చిన్న వయసులోనే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. నిద్రలేమిని జయించాలనీ, ప్రతిరోజూ 7-8 గంటల నాణ్యమైన నిద్ర ఉండేలా చూసుకోవాలని సిఫారసు చేస్తున్నారు. ఇక ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు అవసరమనీ, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని చెబుతున్నారు.

# టమాటాలను అసలు రోజుకు ఎన్ని తినాలి..!



టమాటాలను మనం మన రోజువారి ఆహారంలో భాగంగా వాడుతూనే ఉంటాం. టమాటాలను పలు రకాల కూరల్లో వేస్తుంటారు. ఇతర కూరగాయలతో కలిపి వండుతారు. టమాటాలను అన్ని రకాలుగా వంటల్లో ఉపయోగిస్తూనే ఉంటారు. వృక్షశాస్త్రం ప్రకారం చెప్పాలంటే వాస్తవానికి టమాటా ఒక కూరగాయ కాదు, పండు. కానీ దీన్ని కూరగాయ గానే ఉపయోగిస్తున్నారు. టమాటాల్లో అనేక పోషకాలు ఉంటాయి. అనేక విటమిన్లు, మినరల్స్, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. టమాటాల్లో లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. దీని వల్లే టమాటాలు చూడచక్కని ఎరుపు రంగులో ఉంటాయి. లైకోపీన్ వల్ల మన శరీరంలో ఉత్పత్తి అయ్యే ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావం తగ్గుతుంది. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది.

గుండె ఆరోగ్యానికి..: లైకోపీన్ వల్ల పలు రకాల క్యాన్సర్లను రాకుండా అడ్డుకోవచ్చని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. లైకోపీన్‌తోపాటు టమాటాల్లో పొటాషియం, విటమిన్ సి అధికంగా ఉంటాయి. ఇవన్నీ కలసి గుండె ఆరోగ్యం కోసం పనిచేస్తాయి. పొటాషియం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. లైకోపీన్ ఇతర యాంటీ ఆక్సిడెంట్లతో కలిసి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ ను పెంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. టమాటాల్లో విటమిన్లు సి, కె అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. చర్మంఆరోగ్యంగా ఉండేలాచేస్తాయి. టమా టాల్లో ఉండే విటమిన్ కె ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే గాయాలు అయినప్పుడు తీవ్ర రక్త స్రావం జరగకుండా రక్షిస్తుంది. రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేస్తుంది.

ఉడకబెట్టి తింటే..: టమాటాల్లో ఉండే లైకోపీన్, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని అతినీలలోహిత కిరణాల బారి నుంచి రక్షిస్తాయి. దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. సూర్యకాంతిలోనూ చర్మం కందిపోకుండా చూసుకోవచ్చు. ఇక టమాటాలను తినడం వల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయని చాలా మందికి తెలుసు. కానీ వీటిని రోజుకు ఎంత మోతాదులో తినాలి అని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు పోషకాహార నిపుణులు ఏమని సమాధానం చెబుతున్నారంటే..

టమాటాల్లో లైకోపీన్ అధికంగా ఉంటుందని, ఇది మనకు ఎంతో మేలు చేస్తుందని అందరికీ తెలుసు. అయితే లైకోపీన్ మనకు అధిక మోతాదులో లభించాలంటే టమాటాలను ఎల్లప్పుడూ ఉడికించే తినాలి. పచ్చిగా ఉండే టమాటాల్లో లైకోపీన్ తక్కువగా ఉంటుంది. కనుక లైకోపీన్ ఎక్కువగా కావాలనుకునే వారు టమాటాలను ఉడకబెట్టి తింటే మంచిది.

పచ్చిగా తింటే..: టమాటాల్లో ఉండే లైకోపీన్ ఎక్కువగా కొవ్వుల్లో కరుగుతుంది. కనుక టమాటాలను ఎప్పుడు తిన్నా కొవ్వు పదార్థాలతో తింటే మేలు జరుగుతుంది. ఆలివ్ ఆయిల్, అవకాడో, చేపలు, నెయ్యి, గింజలు, విత్తనాలు వంటి వాటితో కలిపి తింటే లైకోపీన్‌ను శరీరం ఎక్కువగా శోషించుకుంటుంది. అయితే పచ్చి టమాటాలను తినడం వల్ల కూడా లాభాలు ఉన్నాయి. పచ్చి టమాటాలను తింటే విటమిన్ సి ని అధికంగా పొందవచ్చు. టమాటాలను ఉడికిస్తే విటమిన్ సి ని కోల్పోతాము. కానీ లైకోపీన్ ఎక్కువగా లభిస్తుంది. కనుక విటమిన్ సి కావాలంటే టమాటాలను పచ్చిగానే తినాలి. అదే లైకోపీన్ కావాలంటే ఉడకబెట్టి తినాలి. కొందరు రెండు రకాల టమాటాలను కలిపి తింటారు.

దీంతో రెండు పోషకాలను ఒకేసారి పొందవచ్చు. టమాటాలను రోజుకు 2 లేదా 3 కు మించి తినకూడదు. కూరల్లో వేసినా, ఉడికించి లేదా పచ్చిగా తిన్నా 3 టమాటాలకు మించి తినకూడదు. ఇలా టమాటాలను తింటుంటే ఎన్నో లాభాలను పొందవచ్చు.

## తెలివైన వైరస్ డెంగ్యూ

ఢిల్లీఎయిమ్స్ శాస్త్రవేత్తలు సాధారణ జ్వరం కంటే డెంగ్యూ వైరస్ శరీరానికి ఎలా హాని చేస్తుందో తెలుసుకోవడానికి పరిశోధనలు చేశారు. డెంగ్యూ శరీర నొప్పి లేదా అధిక జ్వరాన్ని కలిగించడమే కాకుండా, శరీర రక్షణ నిర్మాణాన్ని నెమ్మదిగా బలహీనపరిచే తెలివైన వైరస్ అని చెబుతున్నారు వైద్య నిపుణులు. డెంగ్యూ వైరస్‌ను శరీరం ఎలా గుర్తించి ఆపగలదు, ఈ వైరస్‌ను తొలగించగలదా అనే ప్రశ్న తలెత్తుతుంది. ఇటీవల, న్యూఢిల్లీలోని ఎయిమ్స్ శాస్త్రవేత్తలు డెంగ్యూ వైరస్ శరీరంలో ఉండే ప్రత్యేక ప్రోటీన్ అర్ఎంబిఎక్స్ ను ఎలా ఉపయోగిస్తుందో కనుగొన్నారు. ఈ ప్రోటీన్ డెంగ్యూ వైరస్ పెరగడానికి సహాయపడుతుంది. ఇక్కడ మన రక్షణ వ్యవస్థ పాత్ర పోషిస్తుంది. అంటే, బాహ్య వైరస్‌లు శరీ రంలోకి ప్రవేశించకుండా నిరోధించే అణువు. దీనికి ఎంఐఆర్- 133జీ అని పేరు పెట్టారు. ఈ అణువు అర్ఎంబిఎక్స్, డెంగ్యూ వైరస్ శరీరం లోపల పెరగకుండా నిరోధి స్తుంది. ఈ పరిశోధన జర్నల్ ఆఫ్ మెడికల్ వైరాలజీలో ప్రచురించడం జరిగింది. ఇది డెంగ్యూ వైరస్ తనను తాను ఎలా ప్రతిబింబిస్తుందో.. ఎంఐఆర్ 133జీ ను ఎలా బలహీనపరుస్తుందో వివరిస్తుంది. ఆ తరువాత అర్ఎంబిఎక్స్ వైరస్లు పెరుగుతాయి. ఇది శరీరంలో జరిగే ఒక రకమైన యుద్ధం, డెంగ్యూ వైరస్ శరీరంపై దాడి చేసిన మొదటి కొన్ని గంటల్లోనే ఇదంతా జరుగుతుంది. ఎయిమ్స్ వైద్యులు దీనిని ఒక పరిశోధన ద్వారా చికిత్స చేశారు. ఇందులో సోకిన కణాలలో ఎంఐఆర్-133జీ అణువుల సంఖ్యను కృత్రిమంగా పెంచారు. దీని కారణంగా డెంగ్యూ వైరస్ పెరగడంలో ఇబ్బంది పడింది. ఎంఐ ఆర్-133జీ సంఖ్య పెరిగినప్పుడు, వైరస్ తనను తాను సులభంగా ప్రతిరూపం చేసుకోలేకపోయిందని పరిశోధనలో వెల్లడైంది. ఎయిమ్స్ బయోటెక్నాలజీ విభాగం లీడ్ సైంటిస్ట్ డాక్టర్ భూపేంద్ర వర్మ ప్రకారం, మన కణాల లోపల ఒక రకమైన టగ్ ఆఫ్ వార్ ఉంటుంది. డెంగ్యూ వైరస్ ఒక దిశలో లాగుతుంది. తద్వారా అది పెరుగుతుంది. మన శరీరం దానిని ఆపడానికి మరొక దిశలో లాగుతుంది. ఎంఐఆర్133జీ వంటి శరీర రక్షకులకు మనం మద్దతు ఇస్తే, అది ఎక్కువ నష్టం కలిగించే ముందు వైరస్‌ను ఆపవచ్చు. అంటే, ఎంఐఆర్-133జీని పెంచడం లేదా అర్ఎంబిఎక్స్ ని ఆపడం నేర్పితే, డెంగ్యూ వైరస్ ను అరికట్టవచ్చం టున్నారు వైద్యులు.

# సైబర్ మోసాల ద్వారా జాగ్రత్తగా ఉండాలి



**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** సైబర్ మోసాల ద్వారా జాగ్రత్తగా ఉండాలని షీ టీమ్స్ సభ్యురాలు మౌనిక అన్నారు. రామగుండం సి.పి ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జ్ ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో సుల్తానాబాద్ లోని జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ మౌనిక మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్,ఎవరైనా చెడుగా మాట్లాడిన, ప్రవర్తించిన తల్లిదండ్రులకు చెప్పాలని, మరియు వాటి నుంచి ఎలా బయటపడటం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు

ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని, సోషల్ మీడియా ప్రభావం వలన జరిగే ఇన్సిడెన్స్ గురించి తెలిపారు.ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు స్నేహలత, సురేష్ మరియు భరోసా కో ఆర్డినేటర్ అశ్రీత, సపోర్టర్ సింధు మరియు హెడ్ మాస్టర్ దివాకర్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెరిగిన పసిడి ధరతో
# అమెరికా అప్పు ఉఫ్!
### ధర పెరుగుదలపై ప్రచారంలో షాడో థియరీ



న్యూఢిల్లీ: ప్రపంచ మార్కెట్‌లో ఇటీవల బంగారం ధర అనూహ్యంగా పెరిగిపోయింది. ఇలా రికార్డు స్థాయిలో పెరగడం ఒక అద్దంకి ప్రణాళికా? లేదా అమెరికా రుణ సంక్షోభాన్ని అధిగమించడానికి ఒక రహస్య నాటకమా అన్న షాడో థియరీ ప్రచారంలో ఉంది. ప్రస్తుత మార్కెట్ ధరతో లెక్క కడితే అమెరికాలో బంగారం పుస్తక విలువ 11 బిలియన్ డాలర్ల నుంచి ఒక ట్రిలియన్ డాలర్‌కు పెరుగుతుంది. ఈ పెరుగుదలతో అమెరికా సులభంగా తన అప్పులు తీర్చేయవచ్చు. దీంతో ఆ దేశానికి ఇప్పుడు కొత్త అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా, ఆస్తుల అమ్మకాలు జరపకుండా ఆకస్మిక లాభం చేకూరుతుందని ఆర్థికవేత్తలు అంటున్నారు. లింక్డ్ ఇన్‌లో వచ్చిన ఒక పోస్ట్ ప్రకారం 1970 నుంచి చూస్తే బంగారం రాబడి 649 రెట్లు ఉంది. ఈ లోహం ఇటీవలి పెరుగుదలకు నిజమైన కారణమేమిటనే లోతైన చర్చకు దారి తీసింది. పెరుగుతున్న రుణాన్ని భర్తీ చేయడానికి అమెరికా తన బంగారు నిల్వలను తిరిగి అంచనా వేయడానికి సిద్ధమవుతుండవచ్చు అన్న సిద్ధాంతం ప్రచారంలో ఉంది. అమెరికా ఇప్పటికీ తన బంగారాన్ని ఫెడరల్ రిజర్వ్ పుస్తకాలలో 1970లో నిర్ణయించిన ఔన్స్‌కు కేవలం 42.22 డాలర్ల ప్రకారం (ప్రస్తుతం 3,000 డాలర్లు) మాత్రమే నమోదు చేసిందని సీనియర్ సలహాదారు ఆసిన్ గుప్తా తెలిపారు. అయితే బంగారం 10 రెట్లు పెరిగిన ప్రకారం లెక్క వేసినా అమెరికా ట్రిలియన్ డాలర్ల రుణాన్ని తుడిచిపెట్టేస్తుందని ఆశిష్ యూ అనే మరో ఆర్థిక నిపుణుడు తెలిపాడు. అయితే ఇది డాలర్ పతనానికి దారి తీస్తుందని, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని అంటుతుందని హెచ్చరించారు. ఈ వాదనను మరో ఆర్థిక వేత్త సేనుగుప్తా ఖండించారు. బంగారం బలపడితే డాలర్ కూడా బలంగా ఉంటుందని ఆయన అన్నారు.

# వసతి గృహాలకు పంపిణీ చేసే సరుకుల ధరలు పెంచడం హర్షణీయం



**పెద్దపల్లి,తెలంగాణ దిశ :** రాష్ట్రంలోని వసతి గృహాలకు సరఫరా చేసే సరుకుల ధరలను పెంచడం హర్షనీయ మని గురుకుల కాంట్రాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు కొంకటి లింగమూర్తి,కోశాధికారి భాస్కర్ అనిల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగపురి మనోహర్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గురుకుల అసోసియేషన్ తరపున ప్రభుత్వానికి వసతి గృహాల సప్లైదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఇతర అధికారులకు విన్నవించామ ని పేర్కొన్నా రు. గత జూన్ నుండి వసతి గృహాలకు క్యాటరింగ్ కిరాణ, చికెన్, మ టన్, కూరగాయలు పాత రేట్లతోనే వేస్తున్నా మని దానివల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని రాష్ట్ర ప్రభుత్వం రేట్లు పెంచడం వల్ల కొంత ఉపశమనం కలిగిందని కాంట్రాక్టర్లు వాపోయారు. మార్కెట్లో ఉన్న రేట్ల ప్రకారం మరోసారి పెంచాలని కోరారు. సరుకుల రేట్లు పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# తమిళనాడులోని వాల్పారైలో ఏనుగుల గుంపు బీభత్సం

**దాడిలో 55 ఏళ్ల నానమ్మ, ఆమె మనవరాలు దుర్మరణం**
**ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారుజామున జరిగిన ఘటన**
**ఆహారం కోసం జనావాసాల్లోకి వచ్చిన ఏనుగుల గుంపు**
**తరచూ దాడులతో భయాందోళనలలో స్థానిక ప్రజలు**




కోయంబత్తూరు తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. అడవి నుంచి జనావాసాల్లోకి చొరబడిన ఏనుగుల గుంపు దాడిలో నానమ్మ, ఆమె మనవరాలు ప్రాణాలు కోల్పోయారు. వాల్పారై సమీపంలోని వాటర్ ఫాల్స్ ఎస్టేట్‌లో తెల్లవారుజామున ఈ దారుణం జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే... వాటర్ ఫాల్స్ తేయాకు తోటలోని కార్మికుల నివాస ప్రాంతంలోకి తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో ఓ ఏనుగుల గుంపు ఆహారం కోసం ప్రవేశించింది. ఆ సమయంలో ఇళ్లలో అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. ఆ గుంపు అసల (55), ఆమె మనవరాలు హేమశ్రీ నిద్రిస్తున్న ఇంటిపై ఒక్కసా రిగా దాడి చేసింది. వారు తేరుకునేలోపే ఏనుగులు వారిని తొక్కి చంపేశాయి. చుట్టుపక్కల వారు శబ్దాలు విని బయటకు వచ్చి చూసేస రికే జరగరాని నష్టం జరిగిపోయింది. సమాచారం అందుకున్న వాల్పారై రేంజ్ అటవీ శాఖ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం వాల్పారై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఏనుగుల సంచారాన్ని పర్యవేక్షించేందుకు ఆ ప్రాంతంలో అదనపు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయడంతో పాటు, గస్తీని ముమ్మరం చేస్తామని వారు హామీ ఇచ్చారు. అయితే, ఈ ప్రాంతంలో ఏనుగుల దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు. వాల్పారై ప్రాంతం ఆనమలై టైగర్ రిజర్వ్ పరిధిలో ఉండటంతో ఇక్కడ ఏనుగుల సంచారం అధికంగా ఉంటుంది. అడవులు తగ్గిపోవడం, ఏనుగుల సహజ సంచార మార్గాలకు అడ్డంకులు ఏర్పడటంతో అవి తరచూ ఆహారం కోసం జనావాసాల వైపు వస్తున్నాయని వన్యప్రాణి నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఓ కార్మికుడు, గత డిసెంబర్‌లో ఓ రైతు కూడా ఏనుగుల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. వరుస ఘటనలతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఏనుగుల దాడుల నుంచి తమను కాపాడాలని, శాశ్వత పరిష్కారం చూపాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# పాఠశాల విద్యలో కీలక మార్పు..

**- సీబీఎస్ఈ విద్యార్థులకు 3వ తరగతి నుంచే ఏఐ బోధన**
**- 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానం అమలు**
**- దేశవ్యాప్తంగా 31 వేల పాఠశాలల్లో ఏఐ సబ్జెక్టు పరిచయం**
**- 6వ తరగతి నుంచి ఏఐని స్కిల్ సబ్జెక్టుగా బోధించనున్న వైనం**
**- కోటి మంది ఉపాధ్యాయులకు ఏఐ టెక్నాలజీపై ప్రత్యేక శిక్షణ**



హైదరాబాద్,తెలంగాణ దిశ : దేశంలో పాఠశాల విద్యారంగంలో కేంద్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మక మార్పునకు సిద్ధమైంది. వేగంగా అభివృద్ధి చెందు తున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పరిధిలోని పాఠశాలల్లో 3వ తరగతి నుంచే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పాఠాలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ నూతన విధానం 2026-2027 విద్యా సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 31 వేల పాఠశాలల్లో అమల్లోకి రానుంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు చిన్న వయసులోనే ఏఐ ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ఏఐ సహాయంతో భాషా నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం, చాట్‌బోట్ ప్రాంప్ట్‌లు, లాంగ్వేజ్ మోడల్స్, జనరేటివ్ ఏఐ వంటి ఆధునిక టెక్నాలజీల గురించి బోధించనున్నారు. 3వ తరగతి నుంచి ప్రాథమిక అంశాలను పరిచయం చేసి, 6వ తరగతి నుంచి ఏఐని ఒక నైపుణ్య సబ్జెక్టుగా (స్కిల్ సబ్జెక్ట్) కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విషయంపై కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, "చిన్న వయసులోనే విద్యార్థులలో టెక్నాలజీ పట్ల అవగాహన పెంచాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం" అని స్పష్టం చేశారు. ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసేం దుకు ఇప్పటికే ఒక పైలట్ ప్రాజెక్టును నడుపుతున్నామని, ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ఏఐ టూల్స్‌ను వినియోగిస్తున్నా రని ఆయన వివరించారు. దేశంలో ఉన్న దాదాపు కోటి మంది ఉపాధ్యాయులకు ఏఐ టెక్నాలజీపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను కూడా చేపట్టనున్నట్లు సంజయ్‌కుమార్ తెలిపారు. దీనివల్ల ఉపాధ్యాయులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని, విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించేందుకు వీలు కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# ప్రభుత్వాలు మారినా.. బతుకులు మారలేదు!

**తాంసి,తెలంగాణ దిశ :** ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారలేదని ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని తాంసి మాలీ సంఘం మహాజన్ ఆశన్న ఆవేదన వ్యక్తంచేశారు.తాంసి మండల కేంద్రంలో మాలీల జెండా పండుగ వారోత్సవాలలో భాగంగా జెండా పండుగ కార్యక్రమా న్ని నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల ఆశయ సాధన, మాలీల ఉద్యమహక్కుల సాధనకు 10 అక్టోబర్ 2002 న ఉద్యమాన్ని ప్రారంభించామని తెలిపారు. విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ లలో వెనుకబడి ఉన్నామని ఎస్టీ హోదా బిల్లును ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలిపి మాలిలకు ఎస్టీ హోదా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాలి మహా సంఘం నాయకులు గంగారాం, విఠల్,



మాజీ సర్పంచ్ కృష్ణ, క్రాంతి యువజన సంఘం అధ్యక్షులు అశోక్, ప్రవీణ్ కుమార్, లోకేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ ద్వారా 'కల్లాల' నిర్మాణం



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** 'తేమశాతం' నిబంధనలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వరి ఆరబెట్టే యంత్రాలు సైతం తక్కువగా ఉండడంతోరోజుల తరబడి వేచిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నదా తల ఇబ్బందులను దూరం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిం ది. ఉపాధి హామీ నిధులతో రైతులు తమ ఇండ్లు, పొలాల వద్ద ధాన్యం ఆరబెట్టుకునేందుకు కల్లాలు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించింది. నాలుగేళ్ల క్రితమే కేంద్రం ఈ అవకాశమిచ్చినా.. రైతులు ముందుకు రాలేదు. అయితే ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ప్రభుత్వం సూచించడంతో ఇండ్లు, పొలాల వద్ద కల్లాల నిర్మాణానికి ముందుకు వస్తున్నారు. ఆరబెట్టుకునేందుకు అష్టకష్టాలు: రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రహదారులు, ఇంటి ముందు ఖాళీగా ఉన్న ఇరుకు స్థలాల్లో ధాన్యం రాశులు పోస్తూ ఆరబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే కోతులు, వర్షాల వల్ల నష్టం జరుగుతుంది. రోడ్లపై ధాన్యం నిల్వ చేస్తుండటంతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగిన ప్రాణాలు పోయిన ఘటనలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ ద్వారా ధాన్యం ఆరబెట్టుకునే కల్లాల నిర్మాణానికి కేంద్రం అవకాశం కల్పిస్తుండడంతో.. రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తున్నారు.

మూడు రకాల కల్లాలు..: జాబ్ కార్డు పొందిన సన్న, చిన్న కారు రైతులు మూడు రకాల కల్లాలు నిర్మించుకునే అవకాశం ఉంది. 50 చదరపు మీటర్ల లోపు చేస్తే రూ. 56 వేలు, 60 చదరపు మీటర్ల లోపు చేస్తే రూ. 68 వేలు, 75

చదరపు మీటర్ల లోపు చేస్తే రూ. 85 వేలు అందజేస్తారు. గతంలో ఇళ్లు, పొలాల వద్ద నిర్మించుకోవాలని ప్రతిపాదనలు తీసుకొచ్చారు. అయితే దీనికి ఒక గుంట వరకు స్థలం అవసరమవుతుండడంతో గతంలో రైతులు మీదుకు రాలేదు. కానీ ఈ సారి కల్లాలు నిర్మించుకునేందుకు ముందుకొస్తున్నారు.

రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి:

గత రెండేళ్లుగా రాష్ట్రంలో రికార్డు స్థాయంలో ధాన్యం ఉత్పత్తి అవుతున్నది. సన్నాలకు బోనస్ అందజేస్తున్నప్పటి నుంచి వరిసాగు మరింత పెరిగింది. ఈ వానాకాలానికి సంబంధించి 80 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం రూ. 21,500 కోట్లు కేటాయించింది. రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నందున.. తేమ 17శాతం లోపు ఉండేలా నిబంధనలు తీసుకొచ్చింది. దీంతో పచ్చిగా ఉన్న ధాన్యం తీసుకునేందుకు కేంద్రాల నిర్వాహకులు నిరాకరిస్తున్నారు. పూర్తిగా ఆరబెట్టి తీసుకురావాలని రైతులకు సూచిస్తున్నారు.

# హైదరాబాద్ అభివృద్ధికి.. రూ.10 వేల కోట్లు..



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగం ఎదుగుదలకు అనుగుణంగా.. రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలపై విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత నరెడ్కోపై ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైటెక్స్‌లో జరిగిన ప్రాపర్టీ షోను ఆయన ప్రారంభించారు. హైదరాబాద్ అభివృద్ధికి తమ ప్రభుత్వం ఏటా రూ. 10 వేల కోట్లు కేటాయిస్తోందని.. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ వంటి ప్రణాళికలతో నగర ముఖ చిత్రాన్ని మారుస్తున్నామని తెలిపారు. హైడ్రా చర్యల ద్వారా ప్రభుత్వ భూములు రక్షించబడుతు న్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ ఎదుగు దలను దృష్టిలో ఉంచుకొని.. రాష్ట్ర వనరులు, పెట్టుబడి అవకాశాలపై విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత నరెడ్కో పై ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. నగర అభివృద్ధికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. గత రెండేళ్లలో దాదాపు రూ. 20 వేల కోట్లకు పైగా నిధులను హైదరాబాద్ అభివృద్ధికి వినియోగించి నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో నగరం అన్ని దిక్కులా అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళికలు అమలు చేయనున్నట్లు వివరించారు.హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చేందుకు మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. రాష్ట్రంలోని అన్ని ముఖ్య ప్రాంతాలను కలుపుతూ నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్డు నగరంలో గ్రామీణ అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. మెట్రో వ్యవస్థ హైదరాబాద్ చుట్టూ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో నగరవాసులకు ట్రాఫిక్ నుంచి ఉపశమనం లభించనుంది. వీటితో పాటు.. మురుగు నీటి శుద్ధి కోసం రూ. 4 వేల కోట్లతో అత్యాధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలు నిర్మించబోతున్నారు.హైడ్రా వంటి సంస్థల ద్వారా ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కొంతమందిలో ఈ కఠిన చర్యలు భయం కలిగించినా, ప్రజా ఆస్తులు రక్షించబడుతున్నాయన్న మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాయదుర్గంలో ఇటీవల ఎకరా భూమి రూ. 177 కోట్ల ధర పలకడం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఎంత వేగంగా దూసుకుపోతుందో నిరూపిస్తుందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.నరెడ్కో ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి.. కేవలం విల్లాలు, హై-రైజ్ భవనాల నిర్మాణం వరకే పరిమితం కాకుండా.. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో గృహాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టికర్తలుగా రియల్టర్లను తమ ప్రభుత్వం గౌరవిస్తుందని పేర్కొంటూ.. వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు.చివరగా.. రియల్ ఎస్టేట్ సంస్థలుతమ సీఎస్ఆర్ నిధులను విద్య, వైద్యంవంటి సామాజిక రంగాల పై అధికంగా ఖర్చు చేయాలని ఆయన ఆదేశించారు. పాఠశాలలు నిర్మించడం తో పాటు.. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణ పనుల ను వేగవంతం చేస్తున్నామని ఆయన ఈ సందర్భంగా వివరించారు.

# వైసీపీ ఉక్కు రాజకీయం




**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :**ఏ రాష్ట్రంలోనైనా సరే ప్రతిపక్షాలు బలపడేది ప్రజా ఉద్యమాల ద్వారానే. ఇది చాలాసార్లు రుజువైన విషయం. ఏపీలో 2024 తర్వాత విపక్షాలకు కలిసివచ్చిన అలాంటి అంశాలు చాలా తక్కువ. చేసిన కొద్దిపాటి ఉద్యమాలు నిరసనలు రాష్ట్రం మొత్తాన్ని కదిలించే అంశాలు కావు. కొన్ని ముఖ్యమైన అంశాలు అలాంటివి దొరికినా వాటిని విపక్షాలు సరిగ్గా వాడుకోలేదనే చెప్పాలి. అలాంటి వాటిలో రాయలసీమ మామిడి రైతుల ఆందోళన, నెల్లూరు జిల్లా కర్రేడులో భూములు కోల్పోతున్న గ్రామస్తుల నిరసన, పెరిగిపోయిన విద్యుత్ బిల్లుల అంశాల వంటివి ముఖ్యం. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై ఇంతవరకు విపక్షాలు కలిసికట్టుగా ముందుకు దిగిన ఉద్యమాలు లేనే లేవు. పోనీ ప్రధాన విపక్షాలుగా భావించే పార్టీలు ఒంటరిగానన్నా ఇలాంటి ముఖ్యమైన విషయాల్లో ఉద్యమానికి దిగాయా అంటే అదీ లేదు. అలాంటి తరుణంలో ప్రధాన విపక్షం వైసీపీకి ఒక ముఖ్యమైన ఆయుధంలా మారే ఛాన్స్ “ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ “ అంశం ద్వారా వస్తోంది.'ఆంధ్రుల హక్కు -విశాఖ ఉక్కు' నినాదంతో ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పుడు ప్రైవేటుపరం కాబోతున్న సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. ఒకపక్క స్టీల్ ప్లాంట్‌ని ఆదుకుంటామని చెబుతున్న కేంద్రం మరోవైపు “పెట్టుబడుల ఉపసంహారణకు సంబంధించి” గతంలో తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని చెబుతోంది. దీంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు కార్మికులలతోపాటు సగటు తెలుగువాడు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం అయిపోతుందన్న నమ్మకానికి దగ్గరవుతున్నారు. ప్రతి నెల వీఆర్ఎస్ తీసుకునే ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ ఉండడంతో పాటు తాజాగా 32విభాగాలను ప్రైవేట్‌పరం చేశారంటూ వస్తున్న వార్తలు ఏళ్ల తరబడి ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగుల నమ్మకంపై దెబ్బకొడుతున్నాయి. అయితే ప్రైవేటు పరం కాకుండా స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామంటూ కూటమి నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించలేకపోతున్నాయి అనేది వాస్తవం అని వామపక్ష నేతలు చెప్తున్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు చేస్తున్న పోరాటానికి బలం సరిపోవడం లేదు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ఉద్యమించడానికి విపక్ష వైసిపికి ఇది అద్భుతమైన అవకాశమని ఎనలిస్టులు చెప్తున్నారు. వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లు వారు చెప్పినట్టుగానే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం నెమ్మదించింది. ప్రవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోకపోయినప్పటికీ దానిపై ముందుకు కూడా వెళ్లలేదు. కాబట్టి ఐదేళ్లు స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నాం అనే క్లయిమ్ వైసిపి నేతలు చేసుకుంటున్నారు. ఇప్పుడు దాన్ని ఆధారంగా చేసుకుని స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగులతో కలిసి ఉద్యమించే అవకాశం వైసీపీకి ఉంది. నిజంగా అలా చేస్తే ప్రజల్లో పార్టీ ఇమేజ్ కూడా పెరుగుతోంది. కానీ రాష్ట్రంలో తన ప్రత్యర్థులతో కలిసి ఉన్న బిజెపికి ఉప రాష్టపతి ఎన్నికల్లో కేంద్రంలో మద్దతిచ్చిన వింత పరిస్థితి వైసిపిది. చంద్రబాబు, పవన్ పై ఒంటికాలిపై లేచే జగన్మోహన్ రెడ్డి బీజేపీపై అంతే తీవ్రంగా ఈ అంశంపై పోరాడగల ధైర్యం చేస్తారా అనేది రాజకీయవర్గాల్లో చర్చగా మారింది. పోలవరం, అమరావతి, వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఈ మూడు ప్రస్తుతం ఆంధ్రుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్నవి. అమరావతిపై వైసీపీ ఇప్పటికీ అస్పష్టమైన స్టాండ్ తోటే ఉంది . పోలవరం నిర్మాణాన్ని రివర్స్ టెండరింగ్ పేరుతో ఐదేళ్లు వెనక తీసుకుపోయిందంటూ టిడిపి పదే పదే ఆరోపణలు చేస్తున్నా దానికి సరైన కౌంటర్ వైసీపీ నుంచి రావడం లేదు. ఇక వారికి మిగిలింది వైజాగ్ స్టీల్ ప్లాంట్. కూటమి నేతల అస్పష్ట ప్రకటనల మధ్య స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం విపక్షాలు ఉద్యమిస్తే కచ్చితంగా ప్రజలు మద్దతు వారికి ఉంటుంది.

# రామాయపట్నం దిశ తిరిగినట్టే

**ఒంగోలు,తెలంగాణ దిశ :**దేశంలో ఇంధన డిమాండ్ అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ భారీ ప్రణాళికతో ముందుకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నం పోర్టు సమీపంలో ఒక అత్యాధునిక చమురు రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ ప్రభుత్వ రంగ సంస్థ యోచిస్తోంది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను ప్రస్తుతం పరిశీలిస్తోంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతి, వినియోగదారు దేశం మనదే. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా చమురు డిమాండ్ 2.5 మిలియన్ బ్యారెల్స్ పెరుగుతుందని అంచనా వేయగా, అందులో కేవలం భారత్‌లోనే రోజుకు 1 మిలియన్ బ్యారెల్స్ డిమాండ్ పెరగనుందని బీపీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ఖన్నా జరిగిన సంస్థ వార్షిక వాటాదారుల సమావేశంలో తెలిపారు. ఈ భారీ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే వ్యూహంలో భాగంగానే బీపీసీఎల్ ఈ కొత్త ప్రాజెక్టును చేపడుతోంది. “భారత్ వృద్ధి సామర్థ్యాన్ని గుర్తించి, ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నం పోర్టు సమీపంలో కొత్త రిఫైనరీ- కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని బీపీసీఎల్ ఆలోచిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రాజెక్ట్ పూర్వ కార్యకలాపాలు ఇప్పటికే కొనసాగుతున్నాయి” అని సంజయ్ ఖన్నా అన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక వివరాలు, సామర్థ్యాన్ని ఆయన వెల్లడించనప్పటికీ, గతంలో సంస్థ యాజమాన్యం ఇచ్చిన సమాచారం ప్రకారం... ఏటా 9 మిలియన్ టన్నుల సామర్థ్యం గల ఈ యూనిట్ నిర్మాణానికి సుమారు రూ.95,000 కోట్లు ఖర్చవుతుం దని అంచనా. ఈ వ్యూహాత్మక పెట్టుబడి బీపీసీఎల్ పెట్రోకెమికల్ వ్యాపార సామర్థ్యాన్ని విస్తరించడంతో పాటు, భారతదేశాన్ని ప్రపంచ రిఫైనింగ్, పెట్రోకెమికల్ కేంద్రంగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందని ఖన్నా వివరించారు. బీపీసీఎల్ రాబోయే 50 ఏళ్ల అవసరాలను తీర్చడానికి 'ప్రాజెక్ట్ ఆస్పైర్'ను చేపట్టింది. ఈ ప్రాజెక్టులో రిఫైనింగ్, మార్కెటింగ్, అప్‌స్ట్రీమ్ రంగాలను బలోపేతం చేయడంతో పాటు, పెట్రోకెమికల్స్, పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, బయోఫ్యూయెల్స్, గ్యాస్ రంగాల్లోకి అడుగుపెట్టనుంది. “ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు, భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక సరికొత్త ఆలోచన”



అని ఆయన పేర్కొన్నారు. 50 ఏళ్ల క్రితం కేవలం 3.8 మిలియన్ టన్నుల ముడి చమురును పెట్రోల్, డీజిల్‌గా మార్చే ఒకే ఒక రిఫైనరీతో ప్రారంభమైన బీపీసీఎల్, ఇప్పుడు 40.5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో మూడు రిఫైనరీలను కలిగి ఉంది. 50 ఏళ్ల క్రితం 3.6 మిలియన్ టన్నుల ఉత్పత్తులను విక్రయించిన సంస్థ, ఇప్పుడు 52.4 మిలియన్ టన్నులకు పైగా పెట్రోలియం ఉత్పత్తులను అందిస్తోంది. “అప్పట్లో మా టర్నోవర్ రూ.552 కోట్లు, లాభం రూ.1.7 కోట్లు. ఇప్పుడు టర్నోవర్ రూ.5 లక్షల కోట్లు దాటగా, లాభం రూ.13,275 కోట్లకు చేరింది” అని ఆయన తెలిపారు. 2040 నాటికి నెట్ జీరో ఉద్గారాలు సాధించాలని బీపీసీఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, 2035 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన పోర్ట్‌ఫోలియోను నిర్మించాలని యోచిస్తోంది. ప్రస్తుతం సోలార్, విండ్ ఎనర్జీ ప్రాజెక్టుల ద్వారా దాదాపు 155 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 71 మెగావాట్ల సోలార్ ప్లాంట్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో 50 మెగావాట్ల రెండు విండ్ ఫారాల వంటి ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల కోసం సింగపూర్‌కు చెందిన సెంబ్‌కార్ప్ గ్రీన్ హైడ్రోజన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తో బీపీసీఎల్ ఒక జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసుకుంది. గ్రీన్ హైడ్రోజన్ రంగంలో, బీనా రిఫైనరీ వద్ద 5 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ యూనిట్‌ను ప్రారంభించింది.

# భూసమస్యలను కాలయాపన లేకుండా త్వరగా పరిష్కరించాలి

**గుట్టలు గుట్టలుగా దరఖాస్తులు అరకొరగా పరిస్కారమా?**

**అన్నం పెట్టె అన్నదాతలను అరిగోసపెట్టకండి**

**జిల్లా అదనపు కలెక్టర్ ని కోరిన మద్దెల దినేష్**



**రామగుండం,తెలంగాణ దిశ :**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా ఏర్పాటు చేసిన రేవన్యూ సదస్సుల్లో జిల్లాలో చాలా మంది రైతులు వివిధ రకాల భూ సమస్యల పరిష్కారం కోసం మీ సేవలలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సుల్లో, జిల్లా కేంద్రంలోని, మరియు స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయాలలో గత కొన్ని సంవత్సరాలుగా దరఖాస్తులు చేసుకున్న ఇప్పటి వరకు ఎలాంటి పరిష్కారం కావడంలేదని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఛాంబర్ లోని ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణు గారిని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ భూసమస్యలు పరిష్కారం కోసం బాధితులు వారి కుటుంబ సభ్యులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, జిల్లా కలెక్టర్, స్థానిక మండలాల తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతూ ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా అనేక విధాలుగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం గొప్పగా ప్రచారం చేసి రైతంగం సమస్యలు పరిష్కరస్తామని గొప్పలు చెప్పడం జరిగిందని, గత ప్రభుత్వం ధరణి చట్టం వల్ల సరైన ఆప్షన్స్ లేక కబ్జా లో ఉన్న వారికి పట్టా పాస్ బుక్ లేక పోవడం, వారసులు మరణించిన వారి భూములను కూడా వారి కుటుంబ సభ్యుల పేర్ల పై క్రమబద్ధీకరణ చేయకపోవడం, భూమి ఎక్కువగా ఉంటే తక్కువగా, తక్కువగా ఉంటే ఎక్కువగా ఉండడం లాంటివి నమోదైనాయని, అలాగే గతంలో కొనుగోలు చేసిన భూములు పట్టా పాస్ బుక్ లలో అసైన్డ్ భూములని పడడం జరిగిందని, ఇలాంటివి భూ భారతి చట్టం ద్వారా అర్హులైన రైతులకు సవరణ చేస్తారనుకుంటే అధికారులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, దాని వల్ల రేవన్యూ సదస్సులు ఉపయోగం లేకుండా పోయిందని, అలాగే జిల్లాలో కొన్ని గ్రామాల్లో రాజకీయ నాయకుల, కొంతమంది రెవెన్యూ అధికారుల అండదండ లతో బ్రతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వచ్చిన వారి భూములను అక్రమంగా ఆర్ఓఆర్ చేయించుకొని రైతు బంధు తో పాటు ఇతర ప్రభుత్వ పథకాలను అక్రమంగా పొందుతూ వలస పోయిన వారికి అన్యాయం జరిగిందని, జిల్లాలో ఇంకా అనేక రకాల భూసమస్యల పరిష్కారానికి నోచుకోక బాధితులు ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూసమస్యలను సులభంగా పరిష్కారం చేయాలనే ఆలోచనతో మేధావులతో చర్చించి భూభారతి చట్టం ప్రవేశపెట్టి దాని ప్రకారం బాధితులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకుని నెలలు గడిచినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రభుత్వం ఏమో భారీగా ప్రచారం చేస్తూ లోపు భూసమస్యల ను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, పరిష్కారం చేయలేదని దీని వల్ల భూసమస్యల బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. కావున జిల్లాలో ఉన్న ప్రతి భూసమస్యలను పరిష్కరించాలని, వాటి కోసం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని మీ ద్వారా వారికి న్యాయం చేయాలని కొరామని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడుతలలో 605 మండలాలో 10,889 రేవన్యూ సదస్సులు జరగ్గ 8,27,330 దరఖాస్తులు వచ్చాయాని సమాచారం, ఇందులో కేవలం 8.53 శాతం దరఖాస్తులనే అమోదించారని, ఇందులో ఆన్లైన్ లో నమోదు చేసిన దరఖాస్తులు 2.52 శాతమే ఉన్నాయని సమాచారం ఇక పెద్దపల్లి జిల్లాలో చూసుకుంటే వాటిని బట్టి అర్థం చేసుకోవచ్చున్నారు. అన్నం పెట్టె అన్నదాతలను అరిగోస పెట్టకుండా రైతుల సమస్యలను పరిష్కరించాలని దినేష్ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు.

# భాగ్యనగరానికి బీచ్..!

హైదరాబాద్, ఆ: పర్యాటకులను ఆకర్షించే అద్భుతమైన చారిత్రక కట్టడాలు, సంస్కృతికి హైదరాబాద్ ప్రసిద్ధి చెందింది. అయితే, సముద్ర తీరం లేకపోవడంతో బీచ్ అనుభూతిని పొందాలంటే నగరవాసులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇకపై ఆ అవసరం లేదు. ముత్యాల నగరానికి త్వరలో కృ త్రిమ బీచ్ అందాలు తోడవ్వబోతున్నాయి. ఈ కృత్రిమ బీచ్‌ను నిజమైన బీచ్‌కు ఏమాత్రం తగ్గకుండా రూపొందించనున్నారు. ఇక్కడ సందర్శకుల కోసం అనేక ఆకర్షణీయమైన ఏర్పాట్లు చేయబోతున్నా రు. జల విలాసాలు... ఈ ప్రాజెక్టులో ము ఖ్యంగా ఆకట్టుకునే అంశం నీటిపై తేలియాడే విల్లాలు. వీటితో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు కూడా ఏర్పాటు చేస్తారు. సాహస క్రీడలు... థ్రిల్ కోరుకునే వారి కోసం బంగీ జంపింగ్, స్కేటింగ్, సెయిలింగ్ వంటి సాహస క్రీడలు అందుబాటులో ఉంటాయి. వీటికి తోడు ప్రత్యేకంగా వింటర్ స్పోర్ట్స్‌ను కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. కుటుంబ వినోదం... కుటుంబంతో కలిసి ఆనందించేందుకు వీలుగా పార్కులు, పిల్లల ఆట స్థలా లు, సైక్లింగ్ జోన్లు, జాగింగ్ ట్రాక్లు ఉంటా యి. అదనపు ఆకర్షణలు.. ఫుడ్ కోర్టులు, థియేటర్లు, అలంకార ఫౌంటెన్లు, వేవ్ పూల్స్ వంటి విశ్రాంతి స్థలాలు సందర్శకులను కట్టిపడేస్తాయి. అన్ని రకాల సదుపాయాలతో ఇది కేవలం ఒక బీచ్గా కాకుండా, ఒక సంపూర్ణ వినోద కేంద్రంగా మారబోతోంది. ఔటర్ రింగ్ రోడ్కు సమీపంలో ఉండటంతో నగరంలో ఎక్కడి నుంచైనా సులభంగా చేరుకునే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయి తే హైదరాబాద్ పర్యాటక రంగంలో కొత్త అధ్యాయం మొదలవుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. హైదరాబాద్‌లో మొట్టమొదటి అర్టిఫిషియల్ బీచ్ ఈ ఏడాది డిసెంబర్‌లో కొత్వాల్ గూడ వద్ద ప్రారంభం కానుంది. రూ.225 కోట్ల బడ్జెట్‌తో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్, సముద్ర తీర అనుభవాన్ని అందించే మానవ నిర్మిత సరస్సు. ఇక్కడ అడ్వెంచర్ స్పోర్ట్స్, ఫ్లోటింగ్ విల్లాస్, వేవ్ పూల్స్ వంటి సౌకర్యాలతో నగరవాసులకు వారాంతపు వినోదాన్ని అందించనుంది. సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ అర్టిఫిషియల్ బీచ్, సముద్ర తీరాన్ని పోలిన అనుభవాన్ని అందించేలా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ డీపీఆర్ ఇప్పటికే సిద్ధమైంది. అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌టీడీసీ) ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర టూరిజం రంగంలో కీలకమైన అడుగుగా చెబుతున్నారు. ఈ అర్టిఫిషియల్ బీచ్ కేవలం ఇసుక, నీటితో మాత్రమే పరిమితం కాదు. ఇందులో ఫ్లోటింగ్ విల్లాస్, స్టార్-కేటగిరీ హోటళ్లు, వేవ్ పూల్స్, ఫుడ్ కోర్టులు, థియేట్రికల్ వేదికలు, డెకరేటివ్ ఫౌంటైన్స్, పార్కులు, సైక్లింగ్ ట్రాక్‌లు, స్కేటింగ్, బంజీ జంపింగ్, సెయిలింగ్, సిమ్యులేటెడ్ వింటర్ స్పోర్ట్స్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఈ సౌకర్యాలు కుటుంబాలకు ఒక రోజంతా ఆనందించే అనుభవాన్ని అందించేలా సిద్ధం చేస్తారు. తెలంగాణలో టూరిజం రూ. 15,000 కోట్ల స్థాయిలో ఉంది. ఈ అర్టిఫిషియల్ బీచ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌ను గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ఒక ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ నగరవాసులకు నగరం వెలుపల ప్రయాణం చేయకుండానే వారాంత వినోదాన్ని అందించడంతో పాటు, హైదరాబాద్‌ను ఒక డైనమిక్ అర్బన్ రిట్రీట్‌గా రూపొందించనుంది.

## అసిఫ్ నగర్ పిఎస్ హెచ్ఎం ఉద్యోగ విరమణ సన్మానం



**కరీంనగర్,తెలంగాణ దిశ:** ఎంపీపీఎస్అసిఫ్ నగర్ పిఎస్ హెచ్ఎం చేన్నమనేని ఆంజనేయరావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాని కిటి పి టి ఎఫ్ జిల్లా శాఖ తరపున ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జంకె రామచంద్రారెడ్డి మాట్లాడు తూ... ఆంజనేయరావు 29 సంవత్స రాల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులకు విద్యా రంగానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల బాలయ్య, రాష్ట్ర కౌన్సిలర్ కోలుగూరి కిషన్ రావు, సీనియర్ ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు కోల రాజమల్లు, జిల్లా బాధ్యులు ఆర్. చంద్రశేఖర రావు, ఎన్.బాలయ్య, రాజశేఖర్ రెడ్డి తదితరులు హాజరై సన్మానించారు.

## వివేకా హత్య కేసు, సుగాలి ప్రీతి..

# కేసులను ఛేధించడం ఎలా

**విజయవాడ,తెలంగాణ దిశ :**ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా వాటికి ప్రాణం వచ్చినట్లు అయ్యింది. ముఖ్యంగా అమరావతికి ఊపిరి పోసింది కూటమి ప్రభుత్వం. అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించగలిగింది. అయితే రాష్ట్రంలో సంచలనంగా మారిన వివేకానంద రెడ్డి హత్య కేసు, సుగాలి ప్రీతి హత్య కేసులు కూడా త్వరగా ఛేదించి నిందితులకు శిక్షపడేలా కూటమి ప్రభుత్వం చేస్తుందన్న నమ్మకం కలిగింది. కానీ ఏడాదిన్నర అవుతున్న ఈ రెండు కేసులు కనీస స్థాయిలో కూడా ముందుకు కదలకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఈ రెండు కేసులను వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చిందన్న ఆరోపణలు, అనుమానాలు ఉన్నాయి. కానీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి వీటినే లేవనెత్తింది. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రెండు కేసులను తేల్చేస్తామని ప్రకటనలు చేశారు. అందుకే టిడిపి మెడకు వివేకానంద రెడ్డి హత్య కేసు.. జనసేన మేడకు సుగాలి ప్రీతి కేసు చుట్టుకున్నాయి. వాటిని తేల్చకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ఆ రెండు పార్టీలు మూల్యం చెల్లించుకోవడం తప్పదువైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసు సంచలనంగా మారింది. గుండెపోటు, నారా సుర రక్త చరిత్ర, సిబిఐ అంటూ రకరకాలుగా వైసిపి దారులు మళ్లించింది. కానీ ఆ గొడ్డలి వేటు రక్తపు మరకలు మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు చూపించాయి. ఈ హత్య ఆరోపణలన్నీ వైఎస్ కుటుంబ సభ్యులు చుట్టే తిరిగాయి. అవినాష్ రెడ్డి నేరస్తుడు అంటూ వివేక కుమార్తె సునీత, జగన్ సోదరి షర్మిల టార్గెట్ చేశారు. అందుకు తగ్గ ప్రాథమిక ఆధారాలను కూడా బయటపెట్టారు. అయినా సరే వైసీపీ హయాంలో కేసు విచారణ అడుగు ముందుకు పడలేదు. అవినాష్ రెడ్డి చుట్టూ జగన్ వలయంగా ఏర్పడి కాపాడగలిగారు అన్నది బహిరంగ రహస్యం. వివేకా కేసులో సునీతకు న్యాయం జరగాలి.. హూ కిల్డ్ బాబాయ్ అన్న ప్రశ్నకు జవాబు చెప్పాలి అంటూ గత ఐదేళ్లలో తెలుగుదేశం పార్టీ భారీ స్లోగన్ ఇచ్చింది. జగన్మోహన్ రెడ్డితో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఎక్కు పెట్టింది. దోషులకు కొమ్ముకాస్తున్నారంటూ జగన్ పై నేరుగా టిడిపి కార్యకర్తల నుంచి నేతల వరకు విమర్శలు చేస్తూనే వచ్చారు. కానీ కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర సమీపిస్తుంది. ఇంకా వివేకా కేసు విషయంలో అసలు వాస్తవాలు బయటకు రావడం లేదు. సునీత ఆరోపిస్తున్న వ్యక్తులు ధైర్యంగా తిరగ గలుగుతున్నారు. వివేకా కుమార్తె సునీత పోరాటానికి ఫలితం దక్కలేదు. కానీ వైసీపీ హయాంలో సునీతతో పాటు ఆమె భర్తపై పెట్టిన కేసులను మాత్రం కోర్టు కొట్టి వేయడం ఉపశమనం. అంతకుమించి ఈ కేసు ముందుకు సాగలేదు. అధికారుల సైతం ఈ కేసు విచారణ పూర్తయిందని కోర్టుకు నివేదించారు. ఈ మొత్తం ఎపిసోడ్లో ఇంకా గందరగోళం నడుస్తోంది. ఇదిలా ఉంటే సుగాలి ప్రీతికేసు జనసేన మేడకు చుట్టుకుంది. 14 సంవత్సరాల గిరిజన బాలికను దారుణంగా హత్య చేశారు. చేయకూడని పని చేసి మట్టుపెట్టారు.

ఈ కేసు ఏపీలో సంచలనంగా మారింది. అయితే ఈ కేసు మూలాలను, సాక్షాలను వైసిపి ప్రభుత్వం తుడిచేసింది అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారుపవన్ కళ్యాణ్. సుగాలి ప్రీతి హత్యకు గాను ఆమె కుటుం బానికి న్యాయం చేయాలని.. వారి పోరాటాలకు ఫలితం దక్కాలి అంటూ నాడు వైసిపి ప్రభుత్వ హయాంలో పవన్ హీరో చిత పోరాటం చేశారు. దీంతో ఈ కేసు బాధ్యత జనసేనపై పడింది. కూటమిలో కీలక భాగస్వామిగా ఉండడంతో ఇప్పుడు పవన్ ఈ కేసును తేల్చాల్సి వస్తోంది. సుగాలి తల్లి నేరుగా పవన్ పై ఇప్పుడు విమర్శలు చేయడంతో ఆయన స్పందించాల్సి వచ్చింది.

జనసేన పోరాట ఫలితం మూలంగానే ఆ కుటుంబానికి న్యాయం జరిగిందని.. కానీ సుగాలి ప్రీతి కేసు లో నిందితులకు శిక్ష పడితేనే అసలు న్యాయం జరిగినట్టని పవన్ కళ్యాణ్ చెప్పారు. అయితే ఈ రెండు కేసులను టిడిపి కూటమి తేలిగ్గా తీసుకుంటే మాత్రం ఇబ్బందికరమే. ఈ రెండు కేసులలో అసలు దోషులు ఎవరు? అనేది నిరూపించ లేకపోతే టిడిపి కూటమికి ఇబ్బందికరమే. నిరూపించ గలిగితే మాత్రం వైసీపీ అరాచకానికి ఫుల్ స్టాప్ పెట్టిన వాళ్ళు అవుతారు.

## బదిలీపై వెళుతున్న జెడికి వీడ్కోలు..

## కొత్త జెడికి స్వాగతం పలికిన యాదవులు

పెద్దపల్లి:పెద్దపల్లి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా పనిచేసిన బి.శంకర్ పదోన్నతిపై ఇటీవల మేడ్చల్ జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో విజయ్ భాస్కర్‌బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన శంకర్ ను, నూతన నంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ విజయభాస్కర్ ను గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలారపు పర్వతాలు యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాత రాజు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నరసయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ యాదవ్, పెద్దపల్లి మండల అధ్యక్షులు దాడి చంద్రమౌళి యాదవ్, ధర్మారం మండల అధ్యక్షులు, జంగ మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# పాక్ నయవంచక విధానాలు !



ఆపరేషన్ సిందూర్ ద్వారా చావుదెబ్బతిన్న పాకిస్థాన్...కాల్పుల విరమణ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చి, మరింత నష్టం జరక్కుండా చూసుకుంది. లేకుంటే భారత్ చేతిలో చావుదెబ్బ తినివుండేది. కానీ ఇప్పుడా విషయం మరచిపోయింది. మళ్లీ యుద్ధ ప్రేలాపనలు పేలుతోంది. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్బాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాటలే ఇందుకు నిదర్శనం. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయ లేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు. ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అయితే వీటిని ఓ హెచ్చరికగా తీసుకుని జాగ్రత్తగా ఉండాల్సిన పాక్ నేతలు తరచూ మాటలు పేలుతూనే ఉన్నారు. ఇదంతా కేవలం అమెరికా అండచూసుకునే అని వేరుగా చెప్పనక్కరలేదు. అమెరికా కూడా గతాన్ని మరచి పాక్‌కు పాలుపోసి పెంచుతోంది. ఎందుకంటే ద్రోహం, వంచనకు మారుపేరు పాకిస్తాన్. ఇన్నాళ్లు కష్టకాలంలో ఆర్థికంగా, సైనికంగా రక్షిస్తూ వస్తున్న డ్రాగన్ కంట్రీ చైనాకు పాకిస్తాన్ నమ్మకద్రోహం చేస్తోంది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌లు అమెరికా పంచన చేరి, చైనా ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారు. రెండుదేశాల మధ్య పాకిస్తాన్ డేంజరస్ గేమ్ ఆడుతోంది. ఇటీవల, పాకిస్తాన్ ట్రంప్‌తో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగు తోంది. ముఖ్యంగా, ఇరు దేశాల మధ్య ఖనిజ ఒప్పందం కుదిరింది. దీంతో బలూచిస్తాన్ ప్రాంతంలోని రేర్ ఎర్త్ మినరల్స్,రాగి వంటి లోహాలను అమెరికా కొల్లగొట్టడానికి చూస్తోంది. దీనికి పాకిస్తాన్ ప్రభుత్వం ప్రత్యక్షంగా సహకరిస్తోంది. నిజానికి ఇంతకాలం చైనాతో చెట్టాపట్టాలేసుకుని తిరిగింది. ఆపరేషన్ సిందూర్ లో కూడా చైనా సాయం తీసుకుంది. అమెరికా దగ్గరకు పిలిచి ముద్దు చేయడంతో ఇప్పుడు చైనాకు చెక్ పెట్టి అమెరికా పంచన చేరింది. అమెరికా, పాకిస్తాన్ స్నేహం భారత్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే అమెరికా మద్దతుతో పాక్ బలుపు మాటలు మాట్లాడుతోంది. ఇక పస్నీ ద్వారా భారత వ్యూహాత్మక ఓడరేవు చాబహార్‌ని కౌంటర్ చేయవచ్చు. అమెరికా స్నేహం పాకిస్తాన్‌కు మిలిటరీ, ఇంటెలిజెన్స్ వంటి వ్యూహాత్మక సహకారాన్ని అందించవచ్చు. ఈ చర్యల ద్వారా పాకిస్తానన రక్షణ ఒప్పందాలను మెరుగు పరుచుకోవచ్చు. పాకిస్తాన్ భౌగోళిక రాజకీయ విశ్వాసాన్ని పెంచుతుంది. భారత్‌తో పోలిస్తే తన స్థానాన్ని బలోపేతం చేస్తుంది. ఈ చర్యలు ఇరాన్‌కు కూడా ప్రమాదకరమే. ఇరాన్ షిప్పింగ్ లైన్లపై అమెరికా నిఘా పెరుగుతుంది. అమెరికా, పాక్ బందంపై భారత్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ట్రంప్ ఇప్పుడు భారత్‌ను ఇబ్బంది పెట్టే ఏ చర్యను కూడా వదలడం లేదు. నిజానికి పాకిస్తాన్ ద్వారా అరేబియా సముద్రానికి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని 60 బిలియన్ డాలర్లతో చైనా చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రారంభించింది. బలూచిస్తాన్‌లో గ్వాదర్ పోర్టును నిర్మించింది. అయితే, ఇప్పుడు ఈ గ్వాదర్ పోర్టుకు కేవలం 70 మైళ్ల దూరంలో అమెరికాతో కలిసి పస్నీ ఓడరేవును నిర్మించేందుకు పాకిస్తాన్ సిద్ధమైంది. ఇది భారత్ ఇరాన్‌లో నిర్మిస్తున్న చాబహార్ పోర్టుకు కేవలం 178 మైళ్ల దూరంలోనే ఉంది. చైనా, భారత్, ఇరాన్, ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలకు కీలమైన ఈ వ్యూహాత్మక స్థానాన్ని పాకిస్తాన్ అమెరికాకు స్థానం కల్పిస్తోంది. ఈ ఓడరేవు అరేబియా, హిందూ మహాసముద్రంలోని సముద్ర భద్రతకు కూడా చిక్కులు కల్పిస్తుంది. ఈ పస్నీ ఓడరేవు ద్వారా బలూచిస్తాన్‌లోని ఖనిజ సంపదను అమెరికాకు తరలించవచ్చని పాకిస్తాన్ భావిస్తోంది. అయితే, ఇప్పటి వరకు దీనిపై రెండు దేశాలు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒక వేళ కార్యరూపం దాల్చితే, చైనాతో పాటు భారత్ ప్రయోజనాలకు కూడా తీవ్ర భంగం కలిగించవచ్చు. దీని నిర్మాణానికి 1.2 బలియన్ డాలర్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ఓడరేవు బ్యాటరీ టెక్నాలజీ, క్షిపణుల తయారీ, అధునాతన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో ఉపయోగించే రాగి, యాంటిమోనీ, నియోడైమియం వంటి ఖనిజాల ఎగుమతులకు గేట్‌వేగా మారుతుంది. సెప్టెంబర్ 8న పాకిస్తాన్ మిలిటరీ ఇంజనీరింగ్ కార్ప్స్‌తో 500 మిలియన్ల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. పాకిస్తాన్ ఈ ఖనిజాల షిప్‌మెంట్‌ను మిస్సోరీకి చెందిన జా స్ట్రాటజిక్ మెటల్స్‌కి ఎగుమతి చేసింది. అమెరికాను మచ్చిక చేసుకుని భారత్‌పై పగతీర్చుకోవడానికి పాక్ వెనకాడకపోవచ్చు. ఆ దేశ రక్షణమంత్రి, ఆర్మీ చీఫ్‌లు అడపాదడపా చేస్తున్న వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిందే.



## మహిళలు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**రాజన్న సిరిసిల్ల,తెలంగాణ దిశ :** మానసిక ఆరోగ్య దినోత్సవంను పురస్కరించుకొని మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రభుత్వ సాధారణ వైద్యశాల ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై మహిళలకు ప్రముఖ సైకాలజిస్ట్ కె.పున్నం చందర్ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ పున్నంచందర్ మాట్లాడుతూ.. మహిళలు మానసిక ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఇటీవలి కాలంలో మహిళలు కుటుంబం, ఉద్యోగం, సామాజిక బాధ్యతలు, వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యం సాధించడంలో అత్యధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ ఒత్తిడి ఫలితంగా ఆందోళన, నిరాశ, నిద్రలేమి, కోపం, శారీరక అనారోగ్యాలు ఏర్పడుతున్నాయని అన్నారు. మహిళలు తమ కుటుంబ అవసరాలనే కాకుండా, తమ వ్యక్తిగత మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా సంరక్షించు కోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఒక సంతోషకరమైన తల్లి, భార్య, ఉద్యోగిని కావాలంటే, ముందు మనసు ప్రశాంతంగా ఉండాలని అన్నారు. మానసిక ఆరోగ్యం కోసం మహిళలు ప్రతిరోజూ స్వీయ సంరక్షణ, మంచి అలవాట్లు అవలంబించాలని తెలిపారు. సరైన నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, యోగా, స్నేహితులతో సంభాషణ, అవసరమైతే సైకాలజిస్టు సహాయం పొందడం లాంటివి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ సిబ్బంది రాపేల్లి లత, బూర శ్రీమతి, కొండ ఉమ, మహిళలు పాల్గొన్నారు.

# పక్షులకు రక్షణ...

చాలామంది ఇళ్లలో ఇప్పుడు పక్షులు కనిపిస్తున్నాయి. అలవాటుగా కొందరుబీ ఆహ్లాదం కోసం మరికొందరుబీ నమ్మకాలు, విశ్వాసాలను పాటిస్తూ ఇంకొందరు.. వాటిని పెంచుకుంటున్నారు. అందమైన బోనుల్లో ఉంచి.. వాటిని అపురూపంగా చూసుకుంటున్నారు. అయితే, తెలియకుండా చేసే కొన్ని చిన్నచిన్న పొరపాట్లు.. పక్షులకు ప్రాణాంతకంగా మారుతుంటాయి. అలా అవ్వొద్దంటే.. కింది సూచనలు పాటించాలి.కొందరు పక్షులకు ప్రేమగా.. చాక్లెట్లు, చిప్స్, స్నాక్స్ తినిపిస్తుంటారు. అవి వాటికి ఏమాత్రం సురక్షితం కాదు. శుభ్రమైన తాజా పండ్లు, విత్తనాలు మాత్రమే అందించాలి. పక్షుల దగ్గర ఘాటైన క్లీనింగ్ స్ప్రేలు, ఎయిర్ ఫ్రెష్‌నర్లను, బాడీ స్ప్రేలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపయోగించవద్దు. పిట్టల ఊపిరితిత్తులు చాలా సున్నితంగా ఉంటాయి. బాగా అలవాటైన తర్వాత పక్షులను ఇంట్లో ఫ్రీగా వదిలేస్తారు. అలాంటప్పుడు వాటికి ఇంట్లోని కొన్ని వస్తువులతో హాని కలిగే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా.. సీలింగ్ ఫ్యాన్లు తిరుగుతున్నప్పుడు పక్షులను బోను నుంచి బయటికి తీయకపోవడమే మంచిది. కొన్నిరకాల పెంపుడు పక్షులు



బొమ్మలతో ఆడుకుంటాయి. అలాంటి బొమ్మలు కొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. పెయింట్ వేయని చెక్క బొమ్మలైతే మంచిది. చిన్నచిన్న భాగాలుగా విడిపోయే ప్లాస్టిక్ బొమ్మలు.. ప్రమాదాన్ని తెచ్చిపెడతాయి. పక్షులు వాటిని ఆహారంగా పొరబడి మింగే అవకాశం ఉంటుంది. వంటగది పొగ కూడా పక్షుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. కిచెన్‌లో ఉపయోగించే ఆయిల్స్, వెనిగర్, మిరపకాయ వంటి వాసనలను పక్షులు అసహ్యించుకుంటాయి.

# పోటీ చేసే అభ్యర్థులకు ఈసీ గైడ్ లైన్స్

**నిజామాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. మొత్తం 5 దశల్లో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, 3 దశల్లో సర్పంచ్, వార్డు ఎన్నికలకు ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రాణి కుముది ని షెడ్యూల్ విడుదల చేశారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. త్వరలో ఎన్నికలు జరగనున్నం దున అభ్యర్థుల అర్హతలు, నామినేషన్, డిపాజిట్ నగదు, వ్యయం పరిమితులపై తెలంగాణ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రేషన్ డీలర్లు పోటీ చేయడానికి అవకాశం ఉంది. అయితే నామినేషన్ల పరిశీలన తేదీ నాటికి 21 ఏళ్లు నిండిన వారిని అర్హులుగా పరిగణిస్తారు. గ్రామ సేవకులు, అంగన్వాడీ కార్యకర్తలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఎయిడెడ్ సంస్థలు, స్థానిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సైతం పోటీ చేయవచ్చు. పోటీ చేసే గ్రామం, స్థానిక నియోజకవ ర్గంలో అభ్యర్థి ఓటు హక్కు కలిగి ఉండాలి. మతసంబంధమైన సంస్థల చైర్మన్లతో పాటు సభ్యులకు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. సింగరేణి, ఆర్టీసీలో మేనేజింగ్ ఏజెంట్, మేనేజర్ లేదా సెక్రటరీ హోదాలో పనిచేసే వారు మినహా ఇతర ఉద్యోగులు పోటీకి అర్హులు. క్రిమినల్ కోర్టులో కొన్ని నేరాలకు శిక్ష పడిన వారు, శిక్ష విధించిన తేదీ నుంచి 5 సంవత్సరాల వరకు ఎన్నికకు అనర్హులవుతారు. పౌర హక్కుల పరిరక్షణ చట్టం-1955 పరిధిలోకి వచ్చే కేసుల్లో శిక్ష పడినవారు పోటీ చేసేందుకు అనర్హులు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏదైనా పనికి కాంట్రాక్టు చేసుకున్నా లేదా నిర్వహణకు ఒప్పందం చేసుకున్నా (కాంట్రాక్టర్లు) స్థానిక ఎన్నికల్లో అనర్హులు అవుతారు. స్థానిక సంస్థల అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ధారించింది. జడ్పీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.1.5 లక్షలు ఖర్చు చేయవచ్చు. ఇక 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థి రూ.2.5 లక్షల వరకు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉంటే రూ.1.5 లక్షల వరకే ఖర్చు చేయాలని ఈసీ పేర్కొంది.

అలాగే 5000 కంటే జనాభా ఎక్కువ ఉన్న పంచాయతీలో వార్డు సభ్యుడు రూ.50 వేలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉంటే గరిష్టంగా రూ.30 వేలు ఖర్చు చేయవచ్చు. అభ్యర్థులు తప్పనిసరిగా తమ బ్యాంక్ ఖాతా వివరాలను సమర్పించాలి. దాంతో పాటు ఎన్నికల ఖర్చుల వివరాలు ఇవ్వాలి. అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు తమ అర్హతలు, క్రిమినల్ చరిత్ర, ఆస్తులతో పాటు అప్పులు, చదువు వివరాలపై సెల్ఫ్ డిక్లరేషన్ అఫిడవిట్ దాఖలు చేయాలి. ఒక్క వివరాలు లేకపోయినా నామినేషన్ రిజెక్ట్ అవుతుంద. అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.

అభ్యర్థులు ఎంత డిపాజిట్ చేయాలి..: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పోటీచేసే కేటగిరిని బట్టి డిపాజిట్ చేయాలి. జడ్పీటీసీ అభ్యర్థి (జనరల్?) అయితే రూ.5 వేలు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు అయితే రూ. 2,500 డిపాజిట్ చేయాలి.

ఎంపీటీసీ అభ్యర్థులు రూ.2,500 (జనరల్).. ఎస్సీ,ఎస్టీ,బీసీ అభ్యర్థులు రూ.1,250.. సర్పంచ్ ?అభ్యర్థి జనరల్ అయితే రూ.2 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1000.. వార్డు సభ్యుడు జనరల్ అయితే రూ.500.. ఎస్సీ,ఎస్టీ, బీసీలు యితే రూ.250 డపాజిట్ చేయాలి. అభ్యర్థులు పంచాయతీల పన్ను బకాయిలతో పాటు కరెంట్ బిల్లులు చెల్లించి రసీదులు తీసుకోవాలి.


## అయోధ్య తరహాలో మార్కండేయ దేవాలయ పునర్నిర్మాణం కోసం నిధి సమర్పణ

**రాజన్న సిరిసిల్ల,తెలంగాణ దిశ :** సిరిసిల్ల మార్కండేయ వీధిలో అత్యంత పురాతనమైన విశిష్టమైన శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయము పునర్నిర్మాణంకై శ్రీ మార్కండేయ స్వామి జయంతి మహోత్సవ సమితి ఒక కార్యచరణను ప్రారంభించిందని శ్రీ మార్కండేయ స్వామి జయంతి మహోత్సవ సమితి కన్వీనర్ మోర శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత రెండు నెలల నుండే పద్మశాలి కుల బంధు వులతో,హిందు బంధువులతో సమాజంలోని అందరిని కలుపుకుని పోయే విధంగా దేవాలయాల ఆధారంగా 22 సమావేశాలను శాంతి నగర్ 'నుండి భూపతినగర్' వరకు, చంద్రంపేట నుండి సాయినగర్ వరకు నిర్వహించి అభిప్రాయాలను సేకరించామని తెలిపారు. దేవాలయ పునర్నిర్మాణం హిందూ సంఘటనా శక్తికి, ఆత్మ గౌరవానికి, సమరసతకు చిహ్నంగా శ్రీ లలితా పరమేశ్వరీ లక్ష్మీనారాయణ సహిత శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయాన్ని పునర్నిర్మా ణములో సామాన్యుడి నుండి సం పన్నుడి వరకు అందరినీ భాగస్వామ్యం చేయాలని భావించి అందుకు నిధిసమర్పణ కార్యాచరణను ప్రారంభించి అందరి అభిప్రాయా లను సేకరించామని తెలిపారు. అతి త్వరలోనే దేవాలయ నిధి సమర్పణ కార్యాచరణను ప్రారంభం చేస్తున్నామని అది కూడా వారం పది రోజులలో ప్రారంభిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము అన్నారు. సమర్పణ కార్య విధానమే స్ఫూర్తిగా తీసుకుని సామాన్యుడి నుండి సంపన్నుడి వరకుఅందరం దేవుడి ముందర సమానమేఅనే భావనతో ప్రయత్నం చేసి సిరిసిల్ల లో దివ్యమైన భవ్యమైన శ్రీ మార్కండేయ ఆలయాన్ని పునర్నిర్మాణం చేద్దామని ఇది మనందరి సంఘటితశక్తికి, స్వాభిమానాఆత్మ గౌరవానికి ప్రతీకగా ఉంటుందని తెలిపారు.

# తండాలో మెరిసిన చిత్రకళ







పేదరికం, వెనుకబాటుతనం ఒకేచోట నివసించే తండాలో ఓ బిడ్డకు పుట్టుకతోనే చిత్రకళ అబ్బింది. తన ప్రతిభేంటో తనకే తెలియదు. హైదరాబాద్‌లో ఉన్నత చదువులు చదువుతూ కుంచె పడితే మట్టిలో మాణిక్యం బయటపడింది. ప్రొఫెషన్ కోర్సులు చేసేంత స్తోమత లేదు. తల్లిలేని బిడ్డను తండ్రిలా ఆదరించిన కోచ్ ఆమెను కళా ప్రపంచంలోకి నడిపించాడు. పెండ్లితో ఎంతోమంది కళాకారిణుల ప్రయాణం ఆగిపోతుంది. కానీ, ఆమె కళల విహారం వివాహంతో మరో మలుపు తిరిగింది. పల్లెలోనే ఉంటూ ప్రపంచ నగరాలకు తను గీసిన చిత్రాలను పరిచయం చేస్తున్నది బాధవత్ వెంకటలక్ష్మి. మాది మెదక్ జిల్లా నర్సాపూర్ దగ్గర్లోని జానకంపేట. చిన్నప్పటి నుంచీ ఏదో ఒకటి చేయాలనే తపన ఉండేది. మాది పల్లెటూరు కావడంతో అక్కడ ఏం చేయడానికి ఉండేది కాదు. నాకు తోచినట్టుగా బొమ్మలు గీస్తూ ఉండేదాన్ని. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ చదవడం కోసం హైదరాబాద్ వచ్చాను. కాలేజ్ అయిపోయిన తర్వాత హాస్టల్‌లో ఖాళీగా ఉండకుండా ఏదో ఒకటి నేర్చుకోవాలనుకున్నాను. దగ్గర్లో ఏయే ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయో వెతికాను. మా హాస్టల్‌కి దగ్గర్లోనే ఒక ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ కనిపించింది. చిన్నప్పటి నుంచి కాలక్షేపం కోసం బొమ్మలు గీసే దాన్ని కదా%ౌ% ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ చూడగానే అందులో ఏదో ఉత్సాహం కలిగింది. ఇన్‌స్టిట్యూట్ నడిపే ప్రవాత్ సార్‌కి నా డ్రాయింగ్స్ చూపిస్తే.. ఇంప్రెస్ అయిపోయారు. 'ఇంతకాలం ఎక్కడున్నావ్. ఏం చేస్తున్నావ్? బాగా డ్రాయింగ్ వేస్తున్నావ్. వెంటనే చేరండి' అన్నారు.

తండ్రిలాంటి సార్..: వారంలో మూడు రోజులు సాయంత్రం ఆర్ట్ క్లాసులు ఉండేవి. పెన్సిల్‌తో డ్రాయింగ్స్ గీసేదాన్ని. సార్ షేడింగ్స్ ఇవ్వడం నేర్పించారు. చాలా తొందరగా నేర్చుకున్నాను. నేను గీసిన బొమ్మలు చూసి.. 'ఇంత బాగా వేస్తున్నావ్. నువ్వే నా ఇన్‌స్టిట్యూట్ నడిపేలా ఉన్నావ్!' అని సార్ ప్రోత్సాహించారు. 'నీకున్న టాలెంట్‌కి ఈ ఫీల్డులోకి ముందే వచ్చుంటే మంచి ఆర్టిస్ట్‌గా పేరొచ్చేది. నీ లైఫ్ సెటిల్ అయ్యేది' అని నాలో స్ఫూర్తిని నింపారు. నా ఆర్ట్‌ని మెచ్చుకునేందుకు మా అమ్మానాన్నలతో మాట్లాడాలని ప్రవాత్ సార్ అనుకున్నారు. ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ అడిగారు. 'మా నాన్న మేస్త్రీ పని చేసేవాడు. నాకు చాలా చిన్న వయసు ఉన్నప్పుడే చనిపోయాడు. మా అమ్మకు ఆరోగ్యం బాగుండదు. మేము ముగ్గురం అక్కచెల్లెళ్లం. మా నాయనమ్మే నన్ను చదివిస్తున్నది' అని చెప్పాను. అప్పుడు సార్ 'నువ్వు నేర్చుకోవాలనుకున్నంత కాలం నేర్చుకో. ఫీజు అడగను.

నువ్వు ఓ స్టేజ్‌కి వచ్చిన తర్వాత లక్ష కాదు రెండు లక్షలు ఇచ్చినా తీసుకుంటాను. అప్పటి వరకు ఫ్రీ' అని చెప్పారు. అన్నట్టే ఆయన ఫీజు తీసుకోలేదు. ఆర్ట్ టీచర్‌గా: ఎమ్మెస్సీ, ఆర్ట్ కోచింగ్.. రెండిటినీ మేనేజ్‌చేయలేకపో యాను. ఇంట్రస్ట్ ఉన్నా సీరియస్‌గా నేర్చుకోలేదు. ఎమ్మెస్సీ అయిపోయింది. ఇంతలో కరోనా వచ్చింది. ఇంటికే పరిమితమ య్యాను. సార్ చెప్పిన టిప్స్, ఇచ్చిన నాలెడ్జ్ తోటి బొమ్మలు గీయడం ప్రాక్టీస్ చేస్తూ వచ్చాను. అప్పుడప్పుడూ సార్‌కి కాల్ చేసేది. ఆయన చెప్పిన ట్రిక్స్ ఫాలో అయ్యేది. ఆయన అన్ని రకాల పెయింటింగ్స్ నేర్పించారు. స్కెచ్, షేడింగ్స్, పోర్ట్రెయిట్, అక్రిలిక్స్, ఆయిల్ కలర్, వాటర్ కలర్ పెయింటింగ్స్ గీయడం నేర్పించారు. ఒక కంపెనీ ఆన్‌లైన్‌లో ఆర్ట్ ట్రైనింగ్‌కి సెలెక్ట్ అయ్యాను. అందులో ఏ గ్రేడ్ సాధించాను. తర్వాత వాళ్లే నన్ను టీచర్‌గా తీసుకున్నారు. రెండేళ్లు ఆన్‌లైన్‌లో ఆర్ట్ పాఠాలు చెప్పాను. ఆర్ట్ కమ్యూనిటీ అర్బన్ స్కెచెస్‌లో చేరాను. వాళ్లతో కలిసి అర్బన్ స్కెచ్‌లు గీశాను.

ఒకడుగు వెనక్కి..: అయిదేండ్ల కిందట నాకు పెండ్లయింది. ఆ తర్వాత పిల్లలు. ఇంట్లో పనులకే సమయం సరిపోతున్నది. మళ్లీ ఉద్యోగంలో చేరలేదు. ఫైన్ ఆర్ట్స్ చదవాలని రెండేళ్ల కిందట తెలుగు విశ్వవిద్యాలయం ఎంట్రన్స్ రాశాను. నాలుగో ర్యాంక్ వచ్చింది. జేఎన్‌ఏఎఫ్‌యూ ఎంట్రన్స్‌లో అరవై నాలుగో ర్యాంక్ వచ్చింది. పిల్లల బాధ్యత కారణంగా వెనకడుగు వేశాను. అయినా మా ఆయన సపోర్ట్‌తో ఆర్టిస్ట్‌గా ముందుకు వెళ్తున్నాను. నర్సాపూర్ దగ్గర ఒక స్కూల్లో ఆర్ట్ టీచర్‌గా చేరాను. పిల్లలు కాస్త పెద్దవాళ్లు అయ్యాక నేను మిస్ చేసుకున్న ఫైన్ ఆర్ట్స్ కోర్స్ చదువుతాను.

రెండడుగులు ముందుకు..: ఆర్ట్ నేర్చుకునే రోజుల్లో.. నా ఫ్రెండ్‌కి పెండ్లి కుదిరింది. ఆమెకు పోర్ట్రెయిట్ గీసి, గిఫ్ట్ ఇచ్చాను. అప్పుడే నేను బొమ్మలు గీస్తానని నలుగురికీ తెలిసింది. నేను టీచర్‌గా పనిచేస్తున్న స్కూల్లో.. ఓ టీచర్ నాతో వాళ్లన్నయ్య బొమ్మ గీయించుకుంది. ఆ సంతోషాన్ని తన వాట్సాప్ స్టేటస్‌లో పంచుకుంది. దానివల్ల మరికొంతమందికి నా గురించి తెలిసింది. అప్పటి నుంచి ఆర్డర్లు వస్తూనే ఉన్నాయి. ఆర్డర్ ఇచ్చినవాళ్ల ద్వారా నలుగురికి తెలియడం, మరికొన్ని ఆర్డర్లు రావడంతో నాకు చేతినిండా పని ఉంటున్నది. ఇప్పుడు ఆన్‌లైన్‌లో ఎక్కడెక్కడి నుంచో ఆర్డర్లు వస్తున్నాయి. ఏ పెయింటింగ్ వేయమంటే అది వేస్తాను.

పోర్ట్రెయిట్స్, చేర్యాల పెయింటింగ్స్, దేవతలు, ల్యాండ్‌స్కేప్స్ వేస్తాను. ఏమీడియం ఆర్డర్ చేస్తే మీడియం వేసి ఇస్తున్నాను. నాకు దేవుడిచ్చిన టాలెంట్ ఇది. నలుగురికి చూపించాలి. చిత్రకళ నాకు దొరికిన నేస్తం.అలాగే యూట్యూబ్ చానెల్ ద్వారా ఆర్ట్ పాఠాలూ చెబుతున్నాను. నన్ను చదివించిన నాయనమ్మకు సదా రుణపడి ఉంటాను. ఈ కళలో మంచి స్థాయికి చేరుకోవాలన్న కల అయితే ఉంది! అందుకోసం నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాను.

# సినిమా..

## 'కిల్' రాఘవ.. నాని ది ప్యారడైజ్‌పై సూపర్ హైప్




టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో నటిస్తోన్న చిత్రం ది ప్యారడైజ్. ఈ చిత్రంలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఇటీవలే విడుదల చేసిన లుక్ నెట్టింట టాక్ ఆఫ్‌దిటౌన్‌గా నిలుస్తోంది. ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. కిల్ యాక్టర్ రాఘవ ఈ సినిమాలో కనిపించబోతున్నాడు. ది ప్యారడైజ్‌లో భాగం కావడం పట్ల ఎక్జయిటింగ్‌కు లోనవుతున్నాడు రాఘవ. శ్రీకాంత్ ఓదెల రాఘవతో స్క్రిప్ట్ డిస్కషన్స్‌లో పాల్గొన్నాడని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈసందర్భంగా శ్రీకాంత్ ఓదెల-రాఘవ కలిసి దిగిన ఫొటో ఒకటినెట్టింట ట్రెండింగ్ అవుతోంది.తాజా టాక్ ప్రకారం త్వరలోనే రాఘవ పోర్షన్‌కు సంబంధించిన సన్నివేశాలను షూటేయబోతున్నారట. ది ప్యారడైజ్ పాన్ ఇండియా సినిమా కాదని.. పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ అని అంటున్నాడు రాఘవ. ఈ చిత్రాన్ని 2026 మార్చి26న ప్రధాన భారతీయ భాషలతోపాటు ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు రెడీ అవుతున్నారు మేకర్స్.

## బిగ్ బాస్ హౌజ్‌లో ప్రేమ జంటల సందడి..!



బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 రొటీన్ గానే కొనసాగుతోంది. కొత్తదనం ఉంటుందేమో అనుకుంటే, మళ్లీ అదే పాత ఫార్ములాలు రంగులు మార్చుకుని ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. షో సెట్టింగ్స్, టాస్కల రూపం మారినా అసలు గుణం మాత్రం దాదాపు యథాతథంగా ఉంది. ఈసారి కూడా ఎప్పటిలానే ప్రేమ జంటలు హౌస్‌ను రంజింపజే స్తున్నాయి. ఈ సీజన్ లో రీతు-పవన్, తనూజ-ఇమ్మాన్యుయేల్ లవ్ ట్రాక్‌లు బాగా హైలైట్ అవుతున్నాయి. ముఖ్యంగా తాజా ఎపిసో డ్‌లో పవన్, రీతు జంట టాస్క్‌లో విజయం సాధించిన సందర్భాల్లో ఒకరినొకరు హగ్గులు చేసుకుంటూ తమ బాండింగ్‌ని మరింతగా ప్రదర్శించారు. వీరి బాండింగ్‌పై ఇతర కంటెస్టెంట్ల నుంచి సెటైర్లు కూడా వస్తున్నాయి. సంజన అయితే "ఛాన్స్ దొరికిందిగా ఇక!" అంటూ ఎద్దేవా చేసింది. మరోవైపు తనూజ మాత్రం ఈసారి పవన్‌పై అలిగింది. టాస్క్‌లో ఓడిపోతున్న ఫ్రస్ట్రేషన్‌ను ఆమె పవన్ పై చూపించింది. అయినా పవన్ కూల్‌గా స్పందిస్తూ తనూజను ఓదార్చే ప్రయత్నం చేశాడు. దీనివల్ల ఈ ట్రయాంగిల్ లవ్ (తనూజ-ఇమ్మా న్యుయేల్-పవన్) హౌస్‌లో మరింత చర్చనీయాంశంగా మారింది. ఇక హౌస్‌లో గొడవలు కూడా తారాస్థాయికి చేరుతున్నాయి. శ్రీజ వరుసగా రాము రాథోడ్, దివ్యలతో గొడవపడుతూ నెగటివిటీ పెంచు కుంటుంది. మిగతా కంటెస్టెంట్లతో విభేదాలు పెరగడంతో ఆమె నడవడిక కూడా హౌస్‌లో కాంట్రవర్సీగా మారింది. ఐదవ వారం ముగియనున్న సమయంలో బిగ్ బాస్ హౌస్‌లోకి వైల్డ్ కార్డ్ ఎంట్రీలు రానున్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే దివ్యా నికితా హౌస్‌లోకి అడుగు పెట్టగా, ఈ వీకెండ్‌లో మరిన్ని వైల్డ్ కార్డ్ ఎంట్రీలు ఉండనున్నట్లు సమాచారం. దీంతోఇంట్లో ఉన్న కంటెస్టెంట్లకుపోటీమరింత కఠినంగా మారనుంది. ఇప్పటికే నాలుగు ఎలిమినేషన్లు పూర్తవ్వగా, ప్రస్తుతం 12 మందికంటెస్టెంట్లు మాత్రమే హౌస్‌లో ఉన్నారు. టాస్క్‌లు, ప్రేమ జంటలు, గొడవలు, సర్ప్రైజ్ ఎంట్రీలుఇలా బిగ్ బాస్ షో రసవత్తరంగా సాగుతూనే ప్రేక్షకులను బాగా ఎంగేజ్ చేస్తోంది. ఎవరు ఈ ప్రేమ ఆటల మధ్యలో గేమ్‌లో నిలబడతారు? అనేది ఆసక్తికరంగా మారింది.

## కమిటీ కుర్రోళ్లు కాంబో మళ్లీ రిపీట్..




గత ఏడాది చిన్న సినిమాగా విడుదలై అంచనాలు మించి భారీ విజయాన్ని సాధించిన 'కమిటీ కుర్రోళ్లు' సినిమా కాంబో మళ్లీ రిపీట్ కానుందన్న వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రేక్షకులతో బాగా కనెక్ట్ అయ్యేలా తెరకెక్కిన ఆ చిత్రానికి దర్శకత్వం వహించిన యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ యదు వంశీ , నిర్మాత నిహారిక కొణిదెల మళ్లీ కలిసి కొత్త ప్రాజెక్ట్ కోసం చర్చలు జరుపుతున్నారని సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం, ఈ కొత్త సినిమా 2026 లో సెట్స్‌పైకి వెళ్లే అవకాశంఉంది. పింక్‌ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కనుంది. 'కమిటీ కుర్రోళ్లు' విజయం తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఇండస్ట్రీలో ఆసక్తి నెలకొంది. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ సినిమాతో 11మంది హీరోలు, 4గురు హీరోయిన్‌లు తెలుగు తెరకు పరిచయం అయ్యారు. రూ.9 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.18.5 కోట్లు థియేట్రికల్ వసూళ్లు, రూ.6 కోట్లు నాన్ థియేట్రికల్ బిజినెస్ సాధించిమొత్తం రూ.24.5కోట్లు రాబట్టి సెన్సే షన్ సృష్టించింది. అవార్డుల రేసులో కూడా 'కమిటీ కుర్రోళ్లు' దుమ్ము రేపింది. సైమా 2025లో ఈ చిత్రం ఘన విజయం సాధించింది.

బెస్ట్ డెబ్యూ ప్రొడ్యూసర్‌గా నిహారిక కొణిదెల, బెస్ట్ డెబ్యూ యాక్టర్‌గా సందీప్ సరోజ్ అవార్డ్ అందుకున్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రకటిం చిన గద్దర్ అవార్డుల్లో కూడా రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను దక్కించుకుంది. జాతీయ సమైక్యత,

మత సామరస్యం, అణగారిన వర్గాల అభ్యున్నతిపై తీసిన ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డుతో పాటు ఉత్తమ డెబ్యూ డైరెక్టర్ అవార్డు యదు వంశీ దక్కించుకున్నాడు. ఇక ప్రస్తుతం పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.2 గా మరో ప్రాజెక్ట్ ఇటీవలే ప్రారంభమైంది. ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో సంగీత్ శోభన్ , నయన్ సారిక జంటగా నటిస్తున్నారు.

## మరోసారి హాట్ టాపిక్‌గా మహేష్ బాబు-రాజమౌళి మూవీ




సూపర్ స్టార్ మహేష్ బాబు కథానాయకుడిగా, భారత దర్శక దిగ్గజం ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ "గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ ఫిల్మ్" ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటికీ, అధికారిక అప్డేట్స్ ఏవీ రాకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశగానే ఉన్నారు. అయితే ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ క్రేజీ లీక్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మహేష్ - రాజమౌళి సినిమా టైటిల్‌గా 'వారణాసి' అనే పేరును పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఇండియన్ మైథాలజీ, యాత్రల నేపథ్యంలో నిర్మించబోతున్న ఈ సినిమాపేరుగా ఈ టైటిల్ ఒక మంచి ఎంపికగా చర్చకు వస్తోంది. వారణాసి అనే నగరం భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. అంతర్జాతీయంగా కూడా ఆధ్యాత్మికతకు చిహ్నంగా గుర్తింపు పొందిన ఈ నగరం పేరు టైటిల్‌గా ఉండటం సినిమాకు ప్రత్యేకమైన పాన్ వరల్డ్ కనెక్షన్‌ని తీసుకువస్తుందని భావిస్తున్నారు. ఇక హాలీవుడ్ లెజెండరీ దర్శకుడు జేమ్స్ కామెరూన్ నవంబర్‌లో భారత్‌కు రానున్నారు. "అవతార్: ద ఫైర్ అండ్ యాష్" ప్రమోషన్‌లో భాగంగా భారత పర్యటనకు వస్తున్న కామెరూన్ చేతుల మీదుగా మహేష్ - రాజమౌళి మూవీ టైటిల్‌ను రివీల్ చేయించాలని జక్కన్న ప్రణాళిక వేస్తున్నట్లు సమాచారం. ఇలా చేయడం వల్ల ఈ సినిమా హైప్ మరింత పెరగనుంది. ఈ గ్రాండ్ మూవీలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటించనుండగా, పాన్ ఇండియా గుర్తింపు తెచ్చుకున్న ఆర్. మాధవన్, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కథను బట్టి ప్రపంచవ్యాప్తంగా షూటింగ్ జరిపేందుకు ప్రణాళికలు వేస్తున్న జక్కన్న, ఈ సినిమాను ఓ విజువల్ ఎక్స్‌పీరియెన్స్‌గా మలచనున్నారు.దుర్గ ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ ఈ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందించనుండగా, టెక్నికల్ టీమ్ అంతా ఇంటర్నేషనల్ లెవెల్‌లో ఉండనుంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రాజమౌళి తెరకెక్కించనున్న ఈ చిత్రం ప్రపంచ సినిమా స్థాయిలో పెద్ద బ్లాక్‌బస్టర్ అవుతుందనే అంచనాలు ఇప్పటికే ఏర్పడ్డాయి.

## పెళ్లి పీటలు ఎక్కబోతున్న త్రిష..!



టాలీవుడ్, కోలీవుడ్ లో లెజెండరీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న అందాల త్రిష పెళ్లి గురించి మళ్లీ చర్చలు ఊపందుకున్నాయి. తాజాగా కోలీవుడ్ సర్కిల్స్‌లో త్రిష పెళ్లికి సంబంధించిన వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. తల్లిదండ్రులు చూసిన సంబంధానికి ఆమె ఓకే చెప్పిందనే టాక్ నడుస్తుంది. త్రిష గతంలో బిజినెస్ మ్యాన్ వరుణ్ మనియన్‌తో నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ నిశ్చితార్థం పెళ్లివరకు దారి తీస్తుందని అనుకోగా, అనూహ్యంగా అది రద్దయింది. అప్పటి నుంచి త్రిష తన కెరీర్‌పైనే దృష్టి సారించింది. మనసుకు నచ్చినవాడు దొరికితే తప్పక పెళ్లి చేసుకుంటాను అని త్రిష గత కొన్నాళ్లుగా చెబుతూ వస్తుంది. తాజా సమాచారం ప్రకారం, త్రిష తల్లిదండ్రులు చండీఘర్‌కు చెందిన ఓ కుటుంబంతో సంబంధం కుదిర్చినట్లు తెలుస్తోంది. ఆ యువకుడు ఆస్ట్రేలియాలో స్థిరపడి బిజినెస్ చేస్తున్నట్టు సమాచారం. ఇటీవల తన వ్యాపారాన్ని భారత్‌లో విస్తరించాడని కూడా చెబుతున్నారు. రెండు కుటుంబాలు దగ్గరైన నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని త్రిష కూడా ఈ సంబంధానికి ఓకే చెప్పినట్లు కోలీవుడ్‌లో చర్చ నడుస్తుంది. అయితే ఈ విషయంపై త్రిష నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం త్రిష చిరంజీవి హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'విశ్వంభర' లో నటిస్తోంది. అదే సమయంలో తమిళంలో 'కరుప్పు' అనే చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. ఇవే ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న ప్రధాన ప్రాజెక్టులు. మునుపటి క్రేజ్ తగ్గిన నేపథ్యంలో ఈ రెండు సినిమాలపై చాలా ఆశలు పెట్టుకుంది త్రిష. ఇక బాలీవుడ్‌లో కూడా త్రిష రీఎంట్రీకు ప్లాన్ చేస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఒక్క సినిమాతో బాలీవుడ్ ప్రయాణాన్ని ఆపేసిన త్రిష, ఇప్పుడు మళ్లీ తన అదృష్టాన్ని పరీక్షించాలనుకుంటుందట. మరి తాజాగా త్రిష పెళ్లికి సంబంధించి జరుగుతున్న ప్రచారంలో నిజం ఎంత ఉంది అన్నది తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. కానీ ఈ సారి మాత్రం త్రిష నిజ ంగానే పెళ్లి పందిరిలోకి అడుగుపెడుతుంది అన్న ఆశాభావం అభిమానుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215